PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 306 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 30 అక్టోబర్ 2026

డిజిటల్ జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు ఏది?

కూచిపూడి నృత్యంలో కిట్స్ విద్యార్థిని సాయి సంజనారెడ్డికి ప్రతిష్ఠాత్మక అవార్డు

కరువులో మూసీ సుందరీకరణ ఎందుకు?

● రూ.1.50 లక్షల కోట్లను రైతులు, ప్రజల కోసం ఖర్చు చేయాలి ● డీపీఆర్ లేకుండానే భారీ ప్రాజెక్టు చేపడుతున్నారంటూ కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్,అక్టోబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో 365 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో, మూసీ సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. మిగతా2లో...

తెలంగాణలో పెట్టుబడులకు భరోసా నాదే!

- ప్రతి రూపాయికీ భద్రత కల్పిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి
- పెట్టుబడులను రెట్టింపు చేయండి.. పూర్తి సహకారం అందిస్తాం

'కొండా' యూటర్న్.. బీఆర్ఎస్‌లోకి వెళ్తారా?

- కేటీఆర్‌పై గత వ్యాఖ్యలను ఉపసంహరించుకున్న కొండా సురేఖ

హైదరాబాద్,అక్టోబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):మాజీ మంత్రి కొండా సురేఖ రాజకీయ వైఖరి మరోసారి చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై గతంలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటూ ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. తన వ్యాఖ్యల వల్ల కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు బాధపడి ఉంటే చింతిస్తున్నట్లు పేర్కొన్నారు.గతంలో కేటీఆర్‌పై కొండా మిగతా2లో...

నవంబర్ 1న భారీ నిరసన ర్యాలీ

స్పష్టం చేసిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని వెల్లడి

100 శాతం ఇథనాల్ వాహనాలకు ఇంధనం ఎలా?

● కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు ● రైతుల ప్రయోజనాలు, పర్యావరణంపై దృష్టి పెట్టాలని సూచన

తెలంగాణ విజయగాథలో భాగస్వాములవుతాం

● తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం ● 2047 నాటికి 3 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగాలి ● పెట్టుబడులకు అపార అవకాశాలు.. అభివృద్ధి ప్రస్థానంలో భాగస్వామ్యం: పీయూష్ గోయల్

హైదరాబాద్,అక్టోబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను 3 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిగతా2లో...

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం!

బీజేపీకి కంచుకోటగా భావించే ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ విజయాలు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు

మియాపూర్ భూములు ప్రభుత్వానివే!

● 550 ఎకరాలపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో విజయం

హైదరాబాద్,అక్టోబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్): హైదరాబాద్‌లోని మియాపూర్ భూములపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో విజయం లభించింది. సుమారు 550 ఎకరాల భూమిపై యాజమాన్య హక్కులు తమవేనంటూ ప్రైవేటు వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న భూ వివాదానికి ముగింపు పలికినట్లయింది.రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న భూములపై ఈ వివాదం కొనసాగుతోంది. గతంలో ప్రత్యేక న్యాయస్థానం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇవ్వగా, 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మిగతా2లో...

తెలంగాణ, ఏపీలో 'సర్' గడువు పొడిగింపు

- నవంబర్ 26 వరకు క్లెయిములు, అభ్యంతరాలకు అవకాశం
- నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా విడుదల

'సర్'పై ప్రతిపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ వ్యూహం

- నితీన్ నబీన్ ఆధ్వర్యంలో కీలక సమావేశాలు

డిజిటల్ మోసాల్లో బ్యాంకులదే బాధ్యత

- బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి: సుప్రీంకోర్టు

100 శాతం ఇథనాల్ వాహనాలకు ఇంధనం ఎలా?

న్యూఢిల్లీ,అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్):100 శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతి ఇస్తే, వాటికి అవసరమైన ఇంధనాన్ని ఎలా సరఫరా చేస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఇలాంటి వాహనాలకు పెద్ద మొత్తంలో ఇథనాల్ అవసరమవుతుందని, అందుకు తగిన ఉత్పత్తి, సరఫరా వ్యవస్థను ఎలా ఏర్పాటు చేస్తారో వివరించాలని సూచించింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేతో కూడిన ధర్మాసనం ఇథనాల్ కేటాయింపులకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ప్రశ్నలు లేవనెత్తింది. వాహనాలు పూర్తిస్థాయిలో ఇథనాల్‌తో నడిచేందుకు అనుమతించినట్లు వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ, అవసరమైన ఇంధనాన్ని అందుబాటులోకి తీసుకురావడంపై స్పష్టత కోరింది. దీనిపై స్పందించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, ఇలాంటి మార్పులకు భారీ స్థాయిలో తయారీ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాల్సి ఉంటుందని తెలిపారు.

రైతుల ప్రయోజనాలకూ ప్రాధాన్యం ఇథనాల్ విధానాన్ని పరిశీలించేటప్పుడు పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల సంక్షేమం, ప్రజా ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య ప్రజలకు ప్రయోజనం కలిగేలా విధానాలు ఉండాలని పేర్కొంది. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే అంశానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. మరోవైపు, కేంద్ర రహదారి రవాణా మంత్రిత్వ శాఖ అక్టోబర్ 26న వాహన నిబంధనల్లో సవరణలు చేసింది. ఈ మార్పులతో అధిక ఇథనాల్ మిశ్రమాలతో పాటు దాదాపు స్వచ్ఛమైన ఇథనాల్‌తో నడిచే వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ నిబంధనల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే, పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే శాతాన్ని ప్రస్తుతం ఉన్న 20 శాతానికి మించి పెంచే తక్షణ ప్రణాళిక లేదని కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి అక్టోబర్ 27న వెల్లడించారు. ఇథనాల్ సరఫరా సంవత్సరం 202526కు సంబంధించి కేటాయింపులపై కొనసాగుతున్న కేసులో సుప్రీంకోర్టు తదుపరి విచారణను నవంబర్‌కు వాయిదా వేసింది. ఇథనాల్ వినియోగాన్ని ప్రోత్సహించే విధానాల్లో సరఫరా సామర్థ్యం, రైతుల ఆదాయం, పర్యావరణ ప్రభావాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరాన్ని ఈ విచారణ మరోసారి ముందుకు తెచ్చింది.

తెలంగాణలో పెట్టుబడులకు భరోసా నాదే!

ప్రతి రూపాయికీ భద్రత కల్పిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

పెట్టుబడులను రెట్టింపు చేయండి.. పూర్తి సహకారం అందిస్తాం

న్యూఢిల్లీ,అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణలో పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడికీ పూర్తి భద్రత కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి పెట్టుబడులకు తానే సంరక్షకుడిగా వ్యవహరిస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వ్యాపార విస్తరణకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని, పెట్టుబడులు, వ్యాపార వృద్ధి, లాభాల అంచనాలను రెట్టింపు చేసుకోవాలని అంతర్జాతీయ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' సన్నాహక కార్యక్రమం గురువారం ఢిల్లీలో జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పెట్టుబడిదారుల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకొని వాటిని ప్రభుత్వ విధానాల్లో అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి అడ్డంకులను తొలగించడం, అవసరమైన విధానపరమైన సహకారం అందించడం తన బాధ్యతని పేర్కొన్నారు.

ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీహైదరాబాద్ ఇకపై ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి నగరాలతో మాత్రమే కాకుండా న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ పడే స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు. తెలంగాణను పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 'తెలంగాణ రైజింగ్2047' లక్ష్యంలో భాగంగా 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుత ఐదు శాతం నుంచి పది శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి కేంద్రం సహకారంకేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో పనిచేస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణెకు మూడు హైస్పీడ్ రైలు మార్గాల ఏర్పాటు, వరంగల్, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల ప్రతిపాదనలకు కేంద్రం సహకరిస్తోందని వివరించారు. ప్రాంతీయ వలయ రహదారి, మెట్రో రైలు విస్తరణ, నేవీ రాడార్ కేంద్రం వంటి అభివృద్ధి కార్యక్రమాలనూ ప్రస్తావించారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు దేశ అభివృద్ధికి పునాది వేశాయని సీఎం పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ హైదరాబాద్ పెట్టుబడుల ప్రస్థానానికి తమ వంతు సహకారం అందించాయని గుర్తుచేశారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

కరువులో మూసీ సుందరీకరణ ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

కరువు సమయంలో ఈ ప్రాజెక్టును వాయిదా వేసి, ప్రతిపాదిత రూ.1.50 లక్షల కోట్లను రైతులు, ప్రజల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ, సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలతో పంటలు ఎండిపోతుంటే మూసీ సుందరీకరణ అవసరమేంటని ప్రశ్నించారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) లేకుండానే భారీ ప్రాజెక్టు చేపడుతున్నారని ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

రైతుల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి గోదావరి, కృష్ణా నదుల నీటిని సమర్థంగా వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. మల్లన్నసాగర్ నుంచి 10 టీఎంసీల నీటిని మూసీలోకి తీసుకురావాలనే ప్రతిపాదనపై ప్రశ్నలు లేవనెత్తారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంతో పాటు విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని కోరారు. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌పై కూడా కేటీఆర్ విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలతో కుదుర్చుకున్న ఒప్పందాలు, వాస్తవంగా వచ్చిన పెట్టుబడులు, కల్పించిన ఉద్యోగాల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలకు విద్యుత్, నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం!

హైదరాబాద్,అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్):బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఎన్ని స్థానాలు గెలిచామన్నది మాత్రమే కాకుండా, ఎక్కడ విజయం సాధించామన్నది కూడా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. బీజేపీకి బలమైన ప్రాంతాలుగా భావించే చోట్ల కూడా ప్రతిపక్ష పార్టీలు విజయాలు సాధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుందని అన్నారు. బీజేపీకి కంచుకోటగా భావించే నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ విజయం సాధించిందని, ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు గెలిచారని మహేశ్‌కుమార్ గౌడ్ ప్రస్తావించారు. ఈ ఫలితాలు ప్రజల రాజకీయ అభిప్రాయాల్లో మార్పును సూచిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలపై బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ ఢిల్లీలో నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న ఇండియా కూటమి నిరసన ర్యాలీకి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తాయని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్షాలు తమ నిరసనను తెలియజేయనున్నాయని పేర్కొన్నారు. ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్లను నిరాకరించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల నిరసనను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీకి వెళ్లి ర్యాలీలో పాల్గొంటారని స్పష్టం చేశారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ, ఎన్నికల ప్రక్రియపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. నవంబర్ 1న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

తెలంగాణ, ఏపీలో 'సర్' గడువు పొడిగింపు

న్యూఢిల్లీ,అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును భారత ఎన్నికల సంఘం పొడిగించింది. క్లెయిములు, అభ్యంతరాల నమోదుకు నవంబర్ 26 వరకు అవకాశం కల్పించింది. ఈ రెండు రాష్ట్రాల్లో తుది ఓటర్ల జాబితాలను నవంబర్ 30న ప్రచురించనున్నట్లు ప్రకటించింది. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో ప్రజలకు మరింత సమయం ఇవ్వాలన్న అభ్యర్థనల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. గడువు పొడిగించాలంటూ బుధవారం సుప్రీంకోర్టు చేసిన సూచనల తర్వాతి రోజే ఈసీ సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఓటర్ల జాబితాల్లో పేర్ల నమోదు, వివరాల సవరణ, అభ్యంతరాల పరిష్కారానికి ఈ నిర్ణయం ఉపయోగపడనుంది.

ఇతర రాష్ట్రాల్లోనూ గడువు పెంపుతెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, హరియాణా, నాగాలాండ్, ఢిల్లీలోనూ ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. మహారాష్ట్రలో క్లెయిములు, అభ్యంతరాల నమోదుకు నవంబర్ 13 వరకు గడువు ఇచ్చారు. అక్కడ నోటీసులు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ నవంబర్ 25 వరకు కొనసాగుతుంది. తుది ఓటర్ల జాబితాను నవంబర్ 30న విడుదల చేయనున్నారు. ఢిల్లీలో క్లెయిములు, అభ్యంతరాల నమోదుకు నవంబర్ 25 వరకు అవకాశం కల్పించారు. అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ డిసెంబర్ 15 వరకు కొనసాగనుండగా, తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 22న ప్రచురించనున్నారు. ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను సరిచూసుకొని, అవసరమైన మార్పుల కోసం నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అధికారులు సూచిస్తున్నారు.

నవంబర్ 1న భారీ నిరసన ర్యాలీ

న్యూఢిల్లీ,అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్):నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిరసిస్తూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై బాధ్యత వహించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నిరసనకు అన్ని ప్రతిపక్ష పార్టీలు మద్దతుగా ఉన్నాయని ఖర్గే తెలిపారు. ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా నవంబర్ 1న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ ప్రజలకు పిలుపునిచ్చింది.

మియాపూర్ భూములు ప్రభుత్వానివే!

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఆ నిర్ణయాన్ని సమర్థించింది. ఈ తీర్పులను సవాలు చేస్తూ ప్రైవేటు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దాదాపు 23 ఏళ్లుగా కొనసాగిన న్యాయపోరాటంలో తాజాగా సుప్రీంకోర్టు అప్పీళ్లను కొట్టివేయడంతో ప్రభుత్వ భూముల హక్కులపై స్పష్టత వచ్చింది. విలువైన భూములను పరిరక్షించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ఈ తీర్పు కీలకంగా మారింది.

'సర్'పై ప్రతిపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ వ్యూహం

న్యూఢిల్లీ,అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్): ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (సర్)పై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు బీజేపీ వ్యూహరచన చేసింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ గురువారం ఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యదర్శులతో పాటు కేంద్ర మంత్రులతో సమావేశాలు నిర్వహించారు. సర్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని ప్రజల్లోకి వెళ్లి సమర్థంగా ఎదుర్కోవాలని చర్చించినట్లు సమాచారం. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించనున్న ర్యాలీ నేపథ్యంలో ఈ సమావేశాలకు ప్రాధాన్యం ఏర్పడింది. సర్ ప్రక్రియపై ప్రజలకు వాస్తవాలను వివరించడంతో పాటు, పార్టీ చేపట్టిన కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపైనా సమావేశాల్లో చర్చించారు.

డిజిటల్ మోసాల్లో బ్యాంకులదే బాధ్యత

- బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్): డిజిటల్ అరెస్టు, సైబర్ మోసాల వల్ల ఖాతాదారులు నష్టపోతే, బ్యాంకులు తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించనట్లు తేలిన సందర్భాల్లో బాధితులకు పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనుమానాస్పద లావాదేవీలను ముందుగానే గుర్తించి, నగదు బదిలీని నిలిపివేసే చర్యలు చేపట్టాలని సూచించింది. ఖాతాదారుల సాధారణ లావాదేవీలకు భిన్నంగా భారీ మొత్తాలు బదిలీ అవుతున్నప్పుడు బ్యాంకులు అప్రమత్తం కావాలని ధర్మాసనం పేర్కొంది. అవసరమైతే కృత్రిమ మేధ సాయంతో అనుమానాస్పద లావాదేవీలను గుర్తించి, సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని సూచించింది. సైబర్ మోసాల నియంత్రణకు రిజర్వు బ్యాంకు రూపొందిస్తున్న నిబంధనలను కూడా పరిశీలించనున్నట్లు తెలిపింది.

'కొండా' యూటర్న్.. బీఆర్ఎస్‌లోకి వెళ్తారా?

(మొదటి పేజీ తరువాయి)

సురేఖ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వివాదానికి దారితీశాయి. ప్రస్తుతం ఆమె మంత్రివర్గం నుంచి తొలగించబడిన నేపథ్యంలో, తాజాగా చేసిన ప్రకటన రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామంతో కొండా దంపతులు బీఆర్ఎస్‌లో చేరుతారనే ఊహాగానాలు మళ్లీ మొదలయ్యాయి. గతంలోనూ పార్టీ మార్పుపై ప్రచారం జరిగినప్పటికీ, దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. కేటీఆర్‌పై వ్యాఖ్యలను ఉపసంహరించుకోవడం రాజకీయ సయోధ్యకు సంకేతమా? లేక వ్యక్తిగతంగా చేసిన ప్రకటన మాత్రమేనా? అనేది స్పష్టత రావాల్సి ఉంది. కొండా సురేఖ తదుపరి రాజకీయ అడుగులపై ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆసక్తి నెలకొంది.

తెలంగాణ విజయగాథలో

భాగస్వాములవుతాం

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తే మరిన్ని పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఔషధ, రక్షణ, అంతరిక్ష, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఆహార శుద్ధి, కృత్రిమ మేధ వంటి రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తాండూరు కందిపప్పు, నిజామాబాద్ పసుపు వంటి ప్రత్యేక గుర్తింపు కలిగిన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేయాలని సూచించారు. వీటి ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా రైతులకు, స్థానిక పరిశ్రమలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ, వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు వంటి కీలక ప్రాజెక్టులు రాష్ట్ర పారిశ్రామిక రంగ అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా ఎగుమతిదారులకు కలిగే అవకాశాలను పరిశ్రమలు వినియోగించుకునేలా జిల్లాల స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. రాష్ట్రం నిర్దేశించుకున్న దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాల సాధనలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

కూచిపూడి నృత్యంలో కిట్స్ విద్యార్థిని సాయి సంజనారెడ్డికి ప్రతిష్ఠాత్మక అవార్డు

నట్వర్ గోపీకృష్ణ అవార్డు2026కు ఎంపిక.. విద్యార్థినిని అభినందించిన కిట్స్ యాజమాన్యం

వరంగల్, అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్): కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) వరంగల్‌కు చెందిన బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విద్యార్థిని ఆర్. సాయి సంజనారెడ్డి ప్రతిష్ఠాత్మక నట్వర్ గోపీకృష్ణ అవార్డు2026ను అందుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో నిర్వహించిన AIDA నట్వర్ గోపీకృష్ణ నేషనల్ అవార్డ్స్, అంతర్జాతీయ సంగీత, నృత్య పోటీలు, నృత్యానందలహరి డాన్స్ ఫెస్ట్2026లో ఆమె ఈ అవార్డును సాధించారు. కిట్స్‌లోని స్వామి వివేకానంద బర్త్‌డే సెలబ్రేషన్స్ (SVBC) క్లబ్ అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్న సంజనారెడ్డి కూచిపూడి నృత్యంలో ప్రతిభ చాటుతూ ఈ ఘనత సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. విద్యాభ్యాసంతో పాటు సాంస్కృతిక రంగంలోనూ రాణించడం ఆమె అంకితభావానికి నిదర్శనమని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఆమెకు ది టెంపుల్ డాన్స్ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గురువు హిమాన్షి కత్రగడ్డ శిక్షణ, మార్గదర్శకత్వం అందించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు, కిట్స్ చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి. నారాయణరెడ్డి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, కిట్స్ అదనపు కార్యదర్శి వొడితల సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి సంజనారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. నిరంజన్, డీన్లు, విభాగాధిపతులు, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ కె. శ్రీధర్, ఎండీఎఫ్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జీలు డాక్టర్ పి.ఎస్.ఎస్. మూర్తి, కె. శైలజ, ఎస్‌వీబీసీ క్లబ్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ కె. రాజేంద్ర ప్రసాద్, టి.వి.ఎన్. దివ్యాంశ్, కళాశాల పీఆర్వో డాక్టర్ డి. ప్రభాకర చారి తదితరులు సంజనారెడ్డికి అభినందనలు తెలిపి, భవిష్యత్తులో విద్యా, కళారంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



నేడు కిట్స్ వరంగల్‌లో జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం 'సమ్ శోధిని'26' ప్రారంభం

- 4,000 మందికి పైగా విద్యార్థుల ప్రతినిధులు హాజరు.. 50కి పైగా సాంకేతిక కార్యక్రమాలు

వరంగల్, అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్): కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, వరంగల్ (కిట్స్ డబ్ల్యూ)లో జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక సింపోజియం 'సమ్ శోధిని'26' ప్రారంభోత్సవం అక్టోబర్ 30న నిర్వహించనున్నట్లు కిట్స్ వరంగల్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు తెలిపారు. కళాశాల ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ) విద్యార్థి చాప్టర్, టెక్నికల్ క్లబ్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (ఎస్ఏసీ), 10 విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు

చెందిన టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ హాజరుకానున్నారు. గౌరవ అతిథిగా టీసీఎస్ అకడమిక్ అలయన్సెస్ హైదరాబాద్ రీజియన్ హెడ్ రిచర్డ్ కింగ్ చత్రగడ్డ పాల్గొననున్నారు. కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు అధ్యక్షత వహించనుండగా, కిట్స్ వరంగల్ కోశాధికారి పి. నారాయణ రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ, 'సాంప్రదాయ ఆలోచనలకు అతీతంగా' అనే ఇతివృత్తంతో సమ్ శోధిని'26 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడంతో పాటు, నూతన ఆవిష్కరణలు, అధునాతన సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకునేందుకు ఈ సింపోజియం వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. పేపర్ ప్రజెంటేషన్లతో పాటు 50కి పైగా సాంకేతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ అఫైర్స్, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొఫెసర్ కె. శ్రీధర్, ఐఎస్‌టీఈ కిట్స్ చాప్టర్ చైర్మన్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. మధుకర్ రెడ్డి, కో-కోఆర్డినేటర్లు డాక్టర్ ఎస్. సునీల్ ప్రతాప్ రెడ్డి, బి. శశికాంత్, కళాశాల పీఆర్వో డాక్టర్ డి. ప్రభాకర చారి, డీన్లు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులు పాల్గొననున్నారు. ఐఎస్‌టీఈ కిట్స్ విద్యార్థి చాప్టర్ అధ్యక్షుడు కె. సాయి సిద్ధార్థ రెడ్డి, టెక్నికల్ క్లబ్ విద్యార్థి అధ్యక్షుడు నిఖిల్ మాదరవేనతో పాటు 4,000 మందికి పైగా విద్యార్థి ప్రతినిధులు ఈ సాంకేతిక వేడుకలో పాల్గొననున్నారు.

ఇసుక లారీలతో ప్రజలకు తప్పని తిప్పలు!

అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌కు సైతం దారి లేని దుస్థితి

రాజుపేట నుంచి చుంచుపల్లి ఓడగూడెం మార్గంలో ప్రజల అవస్థలు.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?

మంగపేట అక్టోబర్ 29 (పీసీడబ్ల్యూ న్యూస్): ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామం నుంచి చుంచుపల్లి ఓడగూడెం వైపు వెళ్లే మార్గంలో ఇసుక లారీల రాకపోకలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకల కారణంగా సాధారణ ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు, కార్లు, టాటా ఏస్ వాహనాల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఈ మార్గంలో ఇసుక లారీలు వరుసగా రాకపోకలు సాగిస్తుండటంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు దారి దొరకక వాహనదారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంటోందని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం జరిగినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు. **అత్యవసర సమయంలో అంబులెన్స్‌కు దారి ఏది?** అన్నింటికంటే ఆందోళన కలిగించే అంశం అత్యవసర వైద్య సేవలకు ఎదురవుతున్న ఇబ్బందులు. ప్రమాదం జరిగినప్పుడు లేదా రోగులను ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు అంబులెన్స్‌కు సైతం సులభంగా దారి లభించకపోతే రోగుల

ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అత్యవసర సమయంలో నిమిషాలు కూడా ఎంతో విలువైనవని, అటువంటి సందర్భాల్లో భారీ వాహనాల రాకపోకల వల్ల ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **చిన్న వాహనదారుల అవస్థలు** ఈ మార్గంలో ప్రయాణించే బైకులు, కార్లు, టాటా ఏస్ వంటి చిన్న వాహనాలు ఇసుక లారీల మధ్య నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోజువారీ పనుల కోసం వెళ్లేవారు, వివిధ అవసరాల నిమిత్తం ప్రయాణించే ప్రజలు ఈ సమస్య కారణంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. భారీ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి, ఇతర వాహనాలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడుతున్నారు. **అధికారులు స్పందించాలి** రాజుపేట నుంచి చుంచుపల్లి ఓడగూడెం మార్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఇసుక లారీల రాకపోకలను పరిశీలించి, రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యంగా అధికారులు భావించి, ఇసుక లారీల రాకపోకలపై పర్యవేక్షణ పెంచి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని రాజుపేట పరిసర ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళా అభ్యర్థులను గెలిపించుకుందాం

● సామాజిక మహిళా న్యాయ వేదిక జిల్లా అధ్యక్షురాలు రేపల్లె స్వర్ణజ

వరంగల్, అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్): రాబోయే వరంగల్ - ఖమ్మం - నల్లగొండ శాసన మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మహిళా అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని సామాజిక మహిళా న్యాయ వేదిక వరంగల్ జిల్లా అధ్యక్షురాలు రేపల్లె స్వర్ణజ డిమాండ్ చేశారు. టికెట్ సాధించిన మహిళా అభ్యర్థుల గెలుపు కోసం మహిళలందరూ ముందుండి ప్రచారం చేసి గెలిపించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రేపల్లె స్వర్ణజ మాట్లాడుతూ... చట్టసభలు, శాసనమండలిలో మహిళల భాగస్వామ్యం మరియు ప్రాతినిధ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పట్టభద్రులైన మహిళలు ఎమ్మెల్సీలుగా గెలిచినప్పుడే శాసనమండలిలో మహిళా లోకం గొంతుక బలపడుతుందని, మన ఆత్మగౌరవాన్ని చాటుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశమని వ్యాఖ్యానించారు. సమాజంలో మహిళల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం పట్టభద్రులైన ప్రతి మహిళ తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. మహిళలు ఓటు హక్కును వినియోగించుకుని, తమ ప్రతినిధులను గెలిపించుకోవడం ద్వారా శాసనమండలిలో బలమైన గొంతుకగా నిలవాలని పిలుపునిచ్చారు.

డిజిటల్ జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు ఏదీ?

● రాజ్యాంగ సవరణలపై ఉన్న శ్రద్ధ బీసీ జనగణనపై ఏదీ? ● అఖిలపక్ష సమావేశంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్): దేశంలో ఓబీసీల కచ్చితమైన జనాభా వివరాలు లేకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి ప్రశ్నించారు. రాబోయే డిజిటల్ జనగణనలో ఓబీసీ కులాల నమోదుకు ప్రత్యేక డ్రాప్‌డౌన్ మెనూ ఏర్పాటు చేయాలని అఖిలపక్ష సమావేశంలో డిమాండ్ చేశారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేపట్టిన కేంద్ర ప్రభుత్వం, బీసీల జనాభా ప్రాతిపదికన న్యాయం చేసేందుకు ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. ఓబీసీల జనాభా, విద్యా, ఉద్యోగ ప్రాతినిధ్యం, సామాజిక పరిస్థితులపై స్పష్టత రావాలంటే కులాల వారీగా గణాంకాలు సేకరించాలని పేర్కొన్నారు. డిజిటల్ జనగణనలో కులాల పేర్ల నమోదుకు ప్రత్యేక అవకాశం కల్పిస్తే గణాంకాల్లో ఏకరూపత, విశ్వసనీయత పెరుగుతాయని కుమారస్వామి తెలిపారు. ఈ అంశాన్ని కేవలం పరిపాలనా సమస్యగా కాకుండా వెనుకబడిన వర్గాల హక్కుల అంశంగా పరిగణించాలని కేంద్రాన్ని కోరారు. ఓబీసీల జనాభా గణనపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన విధాన నిర్ణయం ప్రకటించాలని, సామాజిక న్యాయం కోసం కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. జనాభా వివరాల ఆధారంగానే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సగర (ఉప్పర) కులాన్ని బీసీ గ్రూప్ మార్పు అధ్యయనంలో చేర్చినందుకు బీసీ కమిషన్‌కు కృతజ్ఞతలు

ఖైరతాబాద్, అక్టోబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్, సగర (ఉప్పర) కులాల గ్రూప్ మార్పు అంశంపై రాష్ట్ర బీసీ కమిషన్ సమగ్ర అధ్యయనం చేపట్టడం పట్ల సగర (ఉప్పర) కుల సంఘాల నాయకులు, పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. సగర (ఉప్పర) కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని సుదీర్ఘకాలంగా చేస్తున్న వినతులను కమిషన్ పరిశీలనలోకి తీసుకోవడంపై ధన్యవాదాలు తెలిపారు. ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అధ్యక్షతన ఇటీవల నిర్వహించిన సమావేశంలో సగర కుల గ్రూప్ మార్పు అంశాన్ని సమగ్ర నివేదికలు, క్షేత్రస్థాయి అధ్యయనాల ఆధారంగా పరిశీలించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సగర (ఉప్పర) హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో.. సగర కుల పెద్దలు బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, ఇతర సభ్యులను కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సగర (ఉప్పర) కులస్తుల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి తమ కులానికి తగిన న్యాయం చేయాలని కోరారు. అన్ని రకాల ఆధారాలను పరిశీలించి, బీసీ-డీ నుండి బీసీ-ఏ గ్రూప్‌లోకి మారుస్తూ సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీసీ కమిషన్ చేపట్టిన ఈ అధ్యయనం సగర కుల ప్రజల ఆశలకు, హక్కుల సాధనకు దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో సగర కుల నాయకులు అజ్జకోల్ హరీష్ సాగర్, నీరడి భూపేష్ సాగర్, బంగారు నరసింహ సాగర్, దిండి రామస్వామి, గోపాల్ సాగర్ ఉన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు

● తొలి విడతగా రూ.17 కోట్ల నిధులు మంజూరు

కరీంనగర్, అక్టోబర్ 29 (పీసీడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ నగరవాసులను దశాబ్ద కాలంగా వేధిస్తున్న డంపింగ్ యార్డ్ దుర్గంధం, కాలుష్య సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ కింద తొలి విడతగా రూ.17 కోట్ల నిధులు మంజూరు చేసింది. వ్యర్థాల తొలగింపు (బయో మైనింగ్), పారిశుద్ధ్య ఆధునీకరణకు ఈ నిధులు వినియోగించనున్నారు. నిధుల మంజూరుతో హర్షం వ్యక్తం చేసిన స్థానికులు, బీజేపీ కార్పొరేటర్ మాసం గణేష్ ఆధ్వర్యంలో కోతిరాంపూర్ చౌరస్తాలో పార్టీలకతీతంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాసం గణేష్ మాట్లాడుతూ, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, బండి సంజయ్ కుమార్, మేయర్ కోలగాని శ్రీనివాస్‌తో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో రూ.80 కోట్ల నిధులతో డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిందని మాసం గణేష్ ఆరోపించారు. ప్రస్తుతం నిధులు మంజూరవడంతో రాజకీయాలు చేయకుండా ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు ఏపీపీ చంద్ర, తోట అనిల్, మేకల వెంకటేష్, స్థానికులు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో నేపథ్యంలో తాగునీరు, విద్యుత్తు పొదుపుపై అవగాహన కల్పించాలి

- గ్రామాల్లో జలసిరి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్,అక్టోబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్): ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న రోజుల్లో నీరు, విద్యుత్తు వినియోగంలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. తాగునీటిని పొదుపుగా వినియోగించడం, విద్యుత్తు ఆదాపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం రాత్రి కరీంనగర్ ఐడీఓసీలో వీబీ-జీ రామ్ జీ పథకం పనుల పురోగతిపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో జలసిరి పనులను వేగవంతం చేయాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి బోర్ల పునరుద్ధరణ, నీటి వనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. **విద్యుత్తు, పశువుల అవసరాలపై ప్రత్యేక దృష్టి** విద్యుత్తును పొదుపుగా వినియోగించేలా గృహ వినియోగదారులు, వ్యాపారులు, వాణిజ్య సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ, మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అభివృద్ధి పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వీబీ-జీ రామ్ జీ పథకం ద్వారా వ్యవసాయ అనుబంధ, మత్స్య రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల వసతిగృహాలు, గ్రామపంచాయతీ భవనాలు తదితర ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ కోసం పైకప్పులపై నీటి సేకరణ ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఆర్‌డీవో గీత, డీపీవో జగదీశ్వర్, పంచాయతీరాజ్ ఈఈ జనార్దన్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌ను వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి

● ఎమ్మెల్యే కవ్వంపల్లికి రైతుల కన్నీళ్లు కనిపించడం లేదా?

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి

కరీంనగర్ జిల్లా, అక్టోబర్ 29 (పీసీడబ్ల్యూ న్యూస్): పంటలు ఎండిపోయి, నీటి కరువుతో అల్లాడుతున్న తిమ్మాపూర్ మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో తిమ్మాపూర్‌ను చేర్చకపోవడం అన్యాయమన్నారు. మండలంలో వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నా, రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించడం లేదని విమర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకోవాలని, తిమ్మాపూర్‌ను కరువు మండలంగా ప్రకటించడంతో పాటు పంట నష్టపరిహారం చెల్లించి, ప్రత్యామ్నాయ సాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మాజీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

గుజ్జ సత్యంకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఇవ్వాలి

సామాజిక, చేనేత, విద్యా, వైద్య రంగాల ప్రతినిధుల విజ్ఞప్తి

రాష్ట్ర ప్రభుత్వానికి పలు జిల్లాల నుంచి మద్దతు తీర్మానాలు

హైదరాబాద్, అక్టోబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్): బీసీ హక్కుల సాధన, సామాజిక న్యాయం, విద్యారంగ అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న గుజ్జ సత్యం (గుజ్జ సత్యనారాయణ)కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పలు సామాజిక వర్గాలు, చేనేత, బీసీ సంఘాలు, విద్యా మరియు వైద్య రంగాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యాంగ నిబంధనలు, అర్హతలకు అనుగుణంగా ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ కాచిగూడలోని హోటల్ మహారాజాలో 'చేనేత వర్గాల చైతన్య వేదిక' జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ డిమాండ్‌ను ప్రముఖంగా ప్రస్తావించారు. **అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్న మద్దతు** చేనేత కార్మికులు, పద్మశాలి సమాజం, బీసీ సంఘాలు మరియు పాఠశాలల యాజమాన్యాల సమస్యలను శాసనమండలి వేదికగా వినిపించేందుకు తగిన ప్రాతినిధ్యం అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై పోరాడుతున్న 'బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ' (దీూహీూ)తో పాటు వివిధ జిల్లాలకు చెందిన బీసీ, ప్రజాసంఘాలు గుజ్జ సత్యం అభ్యర్థిత్వానికి మద్దతుగా తీర్మానాలు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. **సేవా దృక్పథానికి దక్కిన గుర్తింపు** విద్యారంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన గుజ్జ సత్యం ప్రైవేట్ పాఠశాలల సమస్యలు, ఉపాధ్యాయుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందేలా విశేష కృషి చేశారని నాయకులు కొనియాడారు. అలాగే, చేనేత రంగానికి చెందిన వేలాది కుటుంబాల ఉపాధి, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై ఆయనకున్న అవగాహన మండలికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇది కేవలం ఒక వ్యక్తికి పదవి ఇచ్చే అంశం కాదని, వివిధ సామాజిక, వృత్తి ధర్మాల సమస్యలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. **సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు** ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ది జగదీశ్, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ కోశాధికారి పుట్టబత్తిని జ్ఞానేశ్వర్, పద్మశాలి నాయకులు జిల్లా నరేంద్ర, వంగాల బాలరాజ్, గంజి వెంకటేశం, వెంకట్రామయ్య, రాజు పాల్గొన్నారు. సోషలిస్ట్ పార్టీ జాతీయ కార్యదర్శి కేవీ గౌడ్, బీసీ మహి ళా నాయకురాలు సోమకవిత తదితరులు హాజరై గుజ్జ సత్యం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి పూర్తి మద్దతు తెలిపారు.

డంపింగ్ యార్డు పాదయాత్ర ప్రజల కోసమా? రాజకీయ ప్రయోజనాల కోసమా?

● ఈటల రాజేందర్ పాదయాత్ర ఉద్దేశాన్ని స్పష్టం చేయాలి

● ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే ప్రధాన లక్ష్యం కావాలి: సామాజిక కార్యకర్త మొహమ్మద్ రషీద్

జవహర్ నగర్, అక్టోబర్ 29 (పీసీడబ్ల్యూ న్యూస్): జవహర్ నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించాలని డంపింగ్ యార్డు ఎత్తివేత జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజా పోరాటానికి రాజకీయాలకు అతీతంగా మద్దతు లభించాలని సామాజిక కార్యకర్త మొహమ్మద్ రషీద్ విజ్ఞప్తి చేశారు. డంపింగ్ యార్డు సమస్యపై ఎంపీ ఈటల రాజేందర్ చేపడుతున్న పాదయాత్ర ఉద్దేశాన్ని ప్రజలకు స్పష్టం చేయాలని కోరారు. జవహర్ నగర్‌తో పాటు అంబేద్కర్ నగర్, గబ్బిలాలపేట, నాగారం, మల్కారం, కీసర సర్కిల్ తదితర ప్రాంతాల ప్రజలు దుర్వాసన, గాలి కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజారోగ్యంపై ప్రభావాన్ని అంచనా వేసి, వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. డంపింగ్ యార్డు తొలగింపునకు ఈటల రాజేందర్ ఎలాంటి కార్యాచరణ చేపడతారు? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తారా? బాధిత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని రషీద్ అన్నారు. డంపింగ్ యార్డు సమస్య ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, వేలాది కుటుంబాల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించినదని పేర్కొన్నారు. పాదయాత్రలు, హామీలు ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడాలని, రాజకీయ ప్రయోజనాలకే పరిమితం కాకూడదని సూచించారు. డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఐక్యంగా ఉండి, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని కొనసాగించాలని మొహమ్మద్ రషీద్ విజ్ఞప్తి చేశారు.

మైనారిటీ సంక్షేమ శాఖలో అవినీతి, అక్రమ నియామకాలపై చర్యలు ఎప్పుడు..?

- కుట్టు మిషన్ల పంపిణీలో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు

- నియామక ఉత్తర్వులు లేకుండానే ఏళ్ల తరబడి ఉద్యోగం.. ప్రభుత్వ జీతం పొందుతున్నారని ఫిర్యాదు

- ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

- కాంగ్రెస్ నాయకురాలు షబాన మహమ్మద్ ఆరోపణలు...

- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు.. చర్యలు తీసుకోకుంటే ధర్నా చేస్తామని హెచ్చరిక



కరీంనగర్,అక్టోబర్29(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న అవినీతి, అక్రమ నియామకాలు, కుట్టు మిషన్ల పంపిణీలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హుస్సేన్‌పురా 33వ డివిజన్ కాంగ్రెస్ నాయకురాలు షబానా మహమ్మద్ జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ బఖ్తియార్ 2017 నుంచి ఎలాంటి అధికారిక నియామక పత్రం లేదా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ఉత్తర్వులు లేకుండానే విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ జీతం పొందుతున్నారని ఆరోపించారు. పేద, అర్హులైన మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలోనూ అక్రమాలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. ముఖ్యంగా కుట్టు మిషన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారుల జాబితాలో మార్పులు చేసి, వందలాది మిషన్లను స్నేహితులు, బంధువులు, ఇతరులకు కేటాయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరి ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీల ఆధారంగా వేర్వేరు పేర్లతో మిషన్లు పంపిణీ చేసి, అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహమ్మద్ బఖ్తియార్ అనధికార నియామకం, ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా జీతం పొందుతున్న అంశంపై 2025 జూలైలో ఉన్నతాధికారుల స్థాయిలో విచారణ జరిగినట్లు షబానా మహమ్మద్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. విజిలెన్స్ విచారణలో నియామకం అనధికారికమని తేలడంతో ఆయనను ఉద్యోగం నుంచి తొలగించినట్లు తనకు తెలిసిందని తెలిపారు. అయినప్పటికీ, ప్రస్తుతం ఆయన అదే కార్యాలయంలో అదే హోదాలో ఎలా కొనసాగుతున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె విమర్శించారు. అక్రమంగా ఉద్యోగం పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోకుండా మైనారిటీ సంక్షేమ శాఖకు చెందిన కొందరు అధికారులు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి అనధికారికంగా ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ రికార్డుల్లో పేరు నమోదు చేసుకుని జీతం పొందుతున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని షబానా మహమ్మద్ అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి మైనారిటీ సంక్షేమ శాఖలోని అక్రమ నియామకాలపై, కుట్టు మిషన్ల పంపిణీలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆరోపణలు రుజువైతే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆందోళన చేపడతామని షబానా మహమ్మద్ హెచ్చరించారు.

కరీంనగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేది బీజేపీ పాలకవర్గమే...

రూ.18 కోట్లతో బయో మైనింగ్.. రూ.80 కోట్లతో ఆధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

కరీంనగర్, అక్టోబర్ 29 (పీసీడబ్ల్యూ న్యూస్): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కరీంనగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు బీజేపీ పాలకవర్గం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. డంపింగ్ యార్డ్ సమస్యకు గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకవర్గాలే కారణమని ఆయన విమర్శించారు. బీజేపీ పాలకవర్గం ఏర్పడిన కొద్ది నెలల్లోనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. **రూ.18 కోట్లతో బయో మైనింగ్** స్వచ్ఛ భారత్ నిధులు రూ.18 కోట్లతో డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాలను తొలగించేందుకు టెండర్లు పూర్తయ్యాయని సునీల్ రావు తెలిపారు. మరో పది రోజుల్లో పనుల ఉత్తర్వులు ఇచ్చి, తొమ్మిది నెలల నుంచి ఏడాది లోపు చెత్త తొలగింపు ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అనంతరం రూ. 80 కోట్లతో ఆధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ప్రతిరోజూ సేకరించే చెత్తను ప్రాసెస్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తద్వారా నగరానికి పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. **ప్రతిపక్షాలకు మాట్లాడే నైతిక అర్హత లేదు** గతంలో అధికారంలో ఉన్న పార్టీలు డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించలేదని, ఇప్పుడు ఆందోళనలు చేస్తామని ప్రకటించడం సమంజసం కాదని సునీల్ రావు విమర్శించారు. బండి సంజయ్ నాయకత్వంలో బీజేపీ పాలకవర్గం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు వంగల పవన్, కొంపెల్లి రామణ్, బండారి వేణు, బండ రమణారెడ్డి, గాజ శివరాం, మేకల వెంకటేష్, కేఏపీపీ చంద్ర, మాసం గణేష్, సోమిడి వేణు, పొన్నం మొండయ్య గౌడ్ పాల్గొన్నారు.

తొర్రూరు మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక

- **యువ నాయకుడు పిట్టల చింటూ ను మండల కార్యదర్శిగా ఎంపిక చేసిన ఎమ్మెల్యే**
- **నూతన కమిటీ సభ్యులు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్న ఎమ్మెల్యే.**

తొర్రూరు ప్రతినిధి,అక్టోబర్ 29 (పీసీడబ్ల్యూ న్యూస్): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామానికి చెందిన పిట్టల చింటూ ను తొర్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా ఎంపిక చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తొర్రూరు మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పిట్టల చింటూ పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆకాంక్షించారు. యువ నాయకుడు పిట్టల చింటు ముదిరాజ్ తొర్రూరు మండల కార్యదర్శిగా ఎన్నికైనారు. గ్రామ లో పార్టీ బలోపేతం మరియు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో చురుక్క పాల్గొంటూ , ఇంకా పార్టీలో ఉన్నత పదవులను చేపట్టాలని సర్పంచ్ కవిత బాలకృష్ణ గారు మనస్ఫూర్తిగా అభినందించారు.

ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడండి

- ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి: జిల్లా ఎస్పీ డా. శబరీష్

- రక్తదాన శిబిరంలో 120 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

- కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపిఎస్.

తొర్రూరు ప్రతినిధి,అక్టోబర్ 29 (పీసీడబ్ల్యూ న్యూస్): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని లైన్స్ క్లబ్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లైన్స్ క్లబ్ వేదికగా గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. .ఈ శిబిరానికి జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన కార్యక్రమాన్ని ప్రోత్సహించారు. ఈ శిబిరంలో మొత్తం 120 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. తొర్రూరు సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన ఈ శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, పౌరులు, మీడియా ప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొర్రూరు సబ్ డివిజన్‌కు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ప్రసంగిస్తూ విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను, త్యాగాలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. అమరవీరుల సంస్మరణలో భాగంగా ప్రతి సంవత్సరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అమరవీరుల త్యాగస్ఫూర్తిని సమాజానికి చాటిచెప్పడంతో పాటు ప్రజల్లో సేవాభావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రక్తదానం అత్యంత గొప్ప మానవతా సేవ అని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని ఎస్పీ అన్నారు. ఆరోగ్యపరమైన అర్హతలు కలిగిన ప్రతి ఒక్కరూ వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాలని, ముఖ్యంగా యువత సామాజిక బాధ్యతతో ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలకు పౌరులు, యువత, మీడియా ప్రతినిధుల నుంచి లభిస్తున్న స్పందన అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరానికి అవసరమైన సహకారం, సదుపాయాలను అందించిన లిఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వరంగల్; లయన్స్ క్లబ్, తొర్రూరు; అమ్మ హాస్పిటల్, తొర్రూరులి ప్రతినిధు లను జిల్లా ఎస్పీ అభినందించారు. కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేసిన తొర్రూరు సబ్ డివిజన్ పోలీస్ అధికారులను, సిబ్బందిని ప్రశంసిం చారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుం టూ నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరం ద్వారా 120 యూనిట్ల రక్తాన్ని సేకరించడం విశేషం. రక్తదా నం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడ టమే కాకుండా సమాజంలో మానవతా విలువలను పెంపొందించవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదా నానికి ముందుకు రావాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

ఆల్ ఇండియా ట్రెక్కింగ్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు

చిట్యాలి అక్టోబర్ 29 (పీసీడబ్ల్యూ న్యూస్):-కేరళ రాష్ట్రంలోని ఇడుక్కి జిల్లా కులమావు ప్రాంతంలో అక్టోబర్ 20 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపును చిట్యాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు దుర్గరాజు, ఎన్సిసి ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొన్న సార్జెంట్ చెంజి అక్షయ,కార్పోరల్ గొర్ల వైష్ణవి, క్యాడెట్ అవుల రమ్య లకు ట్రెక్కింగ్ లో పాల్గొన్నందుకు సర్టిఫికెట్లు అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపులో ప్రతిభ కనబరిచిన కార్పోరల్ గొర్ల వైష్ణవి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని మూడో స్థానం సాధించడంతో ఆమెకు మెరిటోరియస్ సర్టిఫికెట్ లభించిందని తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను చాటడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది అన్నారు. విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయులు బాలరాజు దుర్గరాజు, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయి ట్రెక్కింగ్ క్యాంపులు విద్యార్థుల్లో ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. వివిధ రాష్ట్రాల ఎన్‌సీసీ క్యాడెట్ల తో కలిసి పాల్గొనడం ద్వారా జాతీయ సమైక్యత, స్నేహభావం, సాంస్కృతిక అవగాహన పెరుగుతాయని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొని పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు సోఫియా, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

రామసముద్రం చెరువుపై అసత్య ప్రచారం చేయొద్దు

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదేశాలతో తాత్కాలిక మరమ్మతులు ప్రారంభం

తొర్రూరు ప్రతినిధి, అక్టోబర్ 29 (పీసీడబ్ల్యూ న్యూస్): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరు గ్రామపంచాయతీ పరిధిలోని సుమారు 150 ఏళ్ల చరిత్ర కలిగిన రామసముద్రం చెరువుపై వాస్తవాలు తెలుసుకోకుండా కొన్ని పత్రికలు, చానళ్లు అసత్య ప్రచారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువు రెండు గ్రామాలకు నీరందిస్తుందని, దీనిపై వార్తలు ప్రచురించే ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలని కోరారు. చెరువు మత్తడి కింద సుమారు పదేళ్ల క్రితమే బుంగ ఏర్పడటంతో నీరు వృధాగా బయటకు వెళ్లేదని గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యను గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. చేపల పెంపకానికి సరిపడా నీరు లేక ముదిరాజులు సైతం పలుమార్లు అధికారులను సంప్రదించారని పేర్కొన్నారు. **నీటి నిల్వ కోసం మరమ్మతులు**పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు రామసముద్రం చెరువులో నీటి నిల్వను పెంచి, రాబోయే రోజుల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు తాత్కాలిక మరమ్మతులు ప్రారంభించారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి కూడా గతంలో ఈ సమస్యపై సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ సర్పంచ్ ఈస్సంపల్లి కవిత బాలకృష్ణ, చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మరమ్మతు పనులు చేపట్టారు. చెరువు కట్ట మధ్యభాగంలో కుంగిన ప్రాంతానికి గతంలో మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా చెరువులో నీటిని కాపాడేందుకు ఈ పనులు చేపట్టినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. చెరువు మరమ్మతులకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి గ్రామస్తులు, ముదిరాజులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి పనులపై సర్పంచ్ కవిత బాలకృష్ణ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంపాదకీయం

పత్రికా స్వేచ్ఛపై గొడ్డలిపెట్టు

పత్రికా స్వేచ్ఛకు, పరిశోధనాత్మక జర్నలిజానికి తీవ్ర ముప్పు వాటిల్లే డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి యాక్ట్)ను ప్రభుత్వం తీసుకు వచ్చింది. దీనిపై దేశవ్యాప్తంగా మీడియా సంస్థలు, ఎడిటర్స్ గిల్డ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కొత్త చట్టం లోని కొన్ని నిబంధనలువల్ల వార్తా సంస్థల న్యూస్‌రూమ్‌ల కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని సుప్రీం కోర్టుకు మంగళవారం విన్నవించాయి. దీంతో సుప్రీంకోర్టు తక్షణం స్పందించి ప్రతివాదులకు నవంబర్ 17లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఈ కొత్త చట్టం ప్రకారం ఎవరైనా అవినీతిపరులు, అక్రమార్కులని అనుమానం వస్తే వారి వ్యక్తిగత వివరాలు సేకరించి పరిశోధించడానికి ముందుగా వారి అనుమతి తప్పనిసరి. బ్రిటన్, ఐరోపా వంటి ప్రజాస్వామ్య దేశాల్లోనైతే ఈ విషయంలో జర్నలిస్టులకు పూర్తి స్వేచ్ఛ కల్పిస్తున్నారు. అలాగే ఈ కొత్త చట్టంద్వారా సమాచార హక్కు చట్టాన్ని బలహీనం చేశారు. చట్టం లోని సెక్షన్ 44(3) ద్వారా 2005 నాటి సమాచార హక్కు చట్టాన్ని సవరించారు. దీని ప్రకారం ప్రజా ప్రయోజనాలతో సంబంధం లేకుండా ఏ ప్రభుత్వ అధికారికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని 'ఆర్‌టిఐ' ద్వారా ఇవ్వడానికి వీల్లేదు. ఇంతేకాదు సమాచార వనరుల గోప్యతకు కూడా ఈ చట్టం భంగం కలిగిస్తుంది. జర్నలిస్టులకు రహస్యంగా వాస్తవాలు చెప్పే వ్యక్తుల వివరాలను అందించాలని ప్రభుత్వం కోరితే ఆ సమాచారాన్ని మీడియా సంస్థలు అందించవలసి ఉంటుంది. చట్టం లోని సెక్షన్ 36 ప్రకారం డేటాను సేకరించే విస్తృత అధికారం ప్రభుత్వానికి సంక్రమించింది. ఈ నిబంధనలను ఉల్లంఘించి ఎవరిదైనా వ్యక్తిగత డేటాను అనుమతి లేకుండా ప్రచురిస్తే లేదా చట్టాన్ని పాటించకపోతే ఆయా మీడియా సంస్థలపై లేదా స్వతంత్ర జర్నలిస్టులపై రూ. 200కోట్ల నుండి రూ. 250 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అలాగే ఈ చట్టం కింద పౌరులకు తమ డేటాను తొలగించమని కోరే హక్కు ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి ఏదైనా నేరం పై కేసు నమోదై కోర్టులో విచారణను ఎదుర్కొంటున్నప్పుడు, మీడియా ఆ వార్తను డిజిటల్‌గా పబ్లిష్ చేస్తే సంబంధిత నిందితుడు తన అనుమతి లేకుండా తన పేరు, ఫోటో వాడారని, ఆ వార్తను ఇంటర్నెట్ తొలగించాలని డిమాండ్ చేయవచ్చు. ఈ పరిస్థితి వల్ల ప్రజా ప్రయోజనార్థం రాసిన నిజమైన వార్తలు కూడా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లనుంచి మాయమైపోయే ప్రమాదం ఉంటుంది. ఈ కఠినమైన నిబంధనల దృష్ట్యా జర్నలిస్టులు స్వేచ్ఛగా తమ విధులను నిర్వహించడానికి, వార్తా మూలాల గోప్యతను కాపాడడానికి ప్రత్యేక మినహాయింపులు అవసరమని డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ వాదిస్తోంది. 2018 నుండి 2021 వరకు ప్రతిపాదించిన చట్టం మునుపటి ముసాయిదాల్లో జర్నలిస్టులకు తమ వృత్తిపరమైన బాధ్యతల నిమిత్తం ప్రత్యేక మినహాయింపులు ఉండేవని, అయితే 2022 ముసాయిదాలో, 2023లో రూపొందించిన చట్టంలో ఈ మినహాయింపు తొలగించారని డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. దేశ చరిత్రలో బ్రిటిష్ పాలన లోనూ, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కాలం లోనూ పత్రికా స్వేచ్ఛను అణగదొక్కే సంఘటనలు ఎన్నో జరిగాయి. ఇప్పటికీ జరుగుతున్నాయి. మీడియాపై ఆంక్షలు విధించడం, చట్టాలను దుర్వినియోగం చేయడం, జర్నలిస్టులను వేధించడం వంటి సంఘటనలు జరిగాయి. 1951లో శాంతిభద్రతల పేరుతో పత్రికా స్వేచ్ఛపై కొన్ని పరిమితులు విధించారు. 19751977 లో ఎమర్జెన్సీ, 1988లో పరువునష్టం బిల్లు, 20092014లో ఇంటర్నెట్, సోషల్ మీడియా వేదికలపై నియంత్రణ, తదితర చర్యలు గతంలో ఉదాహరణగా నిలిచాయి. రాష్ట్రాల్లోని ప్రాంతీయ ప్రభుత్వాలు కూడా తమకు నచ్చని మీడియా సంస్థలపై అప్రకటిత నిషేధాజ్ఞలు విధించడం, కొందరి జర్నలిస్టులపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించడం జరుగుతున్నాయి. 2003లో తమిళనాడులో ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో వచ్చిన విమర్శనాత్మక వార్తా కథనాల కారణంగా ఆ పత్రికకు సంబంధించిన పాత్రికేయులు, ఉన్నతాధికారులకు అప్పటి రాష్ట్ర శాసనసభ జైలు శిక్ష విధించడం సంచలనం కలిగించింది. అయితే 2004 జులైలో ఆ తీర్మానాన్ని వెనక్కు తీసుకున్నారు. 2026 అక్టోబరులో సుప్రీం కోర్టు ఈ కేసుకు సంబంధించిన విచారణలను నిరర్థకమైనవిగా పరిగణించి ముగించడం గమనార్హం. అయితే భావప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు లభించలేదు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అనేది నిరంతరం సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. కాలం మారినా, ప్రభుత్వాలు మారినా, అధికారంలో ఉన్న శక్తులు తమను ప్రశ్నించే మీడియా గొంతును అణచివేయడానికి చట్టాలను, అధికార యంత్రాంగాన్ని ఆయుధాలుగా వాడుకున్న సందర్భాలు స్పష్టంగా కనిపిస్తాయి. వ్యక్తిగత గోప్యత ముఖ్యమే అయినా, ప్రభుత్వ లేదా ప్రజా పదవుల్లో ఉన్నవారి దుష్ప్రవర్తనపై చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా పరిశీలన జరగకుండా అడ్డుకోవడానికి గోప్యతను ఒక సాధనంగా ఉపయోగించకూడదు. వ్యక్తుల గోప్యతను కాపాడటం, అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించడానికి పాత్రికేయులకు అవకాశం కల్పించడం ఈ రెండూ పరస్పర విరుద్ధమైన లక్ష్యాలుగా ఉండకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యతను చట్టమే కాపాడాలి.

యువతలో బిజెపిపై వ్యతిరేకత కనిపిస్తోంది: మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్: నాగ్‌పూర్‌లో బిజెపిని ఓడించామని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బిజెపికి బ్యాలెట్ ద్వారా బుల్లెట్ దించామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలోనూ బిజెపి ఓటమి పాలైందని, బిజెపి జాతీయ అధ్యక్షుడి స్థానంలోనూ ఓడిపోయిందని వ్యాఖ్యానించారు. బిజెపి పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని, ముఖ్యంగా యువతలో అసంతృప్తి కనిపిస్తోందని అన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న ర్యాలీలో పాల్గొంటామని, రైళ్ల కేటాయింపు విషయంలో కేంద్రంపై ప్రధాని మోదీ ఒత్తిడి కారణంగానే రైళ్లు కేటాయించడం లేదని ఆరోపించారు. రైళ్లు ఇవ్వకపోతే బస్సుల్లో వెళ్లి ర్యాలీలో పాల్గొంటామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

ఎక్కడ తగ్గాలో కాంగ్రెస్ గ్రహిస్తేనే..

మితిమీరిన కోరికలు వ్యక్తం చేస్తే 'ఆశకు హద్దుండాలి, మోహానికి సిగ్గుండాలి' అని మందలిస్తుంటారు. కానీ, కాంగ్రెస్‌ను మందలించేవారెవరు? మందలించకుంటే మరి కాంగ్రెస్ బాగుపడేదెలా? కాంగ్రెస్ బాగుపడకుండా దేశంలో ప్రతిపక్షమైన 'ఇండియా కూటమి' ఎన్నికల్లో మెరుగుపడేదెలా? సమకాలీన రాజకీయాలపై కనీస అవగాహన ఉన్నవారెవరికైనా దేశంలో అతిపెద్ద జనాభా రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రస్తుత రాజకీయాల్ని గమనిస్తే ఈ ప్రశ్నలు తలెత్తక మానవు. ఎందుకంటే, కాంగ్రెస్ అలా ప్రవర్తిస్తోంది. 403 నియోజకవర్గాలున్న యుపి అసెంబ్లీ ఎన్నికల పొత్తుల్లో కాంగ్రెస్ తనకు 200 సీట్లు కావాలంటోంది. పొత్తు కుదురుతుందా? బెడుస్తుందా? అన్నది ఇకపై కాంగ్రెస్ వ్యవహరించే తీరుపైనే ఆధారపడనుంది. కిందటి (2022) ఎన్నికల్లో కాంగ్రెస్ గొంతెమ్మ కోరికలకు సమాజ్‌వాదీ పార్టీ ససేమిరా అంటే, అలిగి, వేర్పడి పోటీ చేసింది. మిగతా 'అమాం బాపతు' పార్టీలను కలుపుకొని 'యుపిఎ' కూటమిగా పోటీ చేసి బొక్కబోర్లా పడింది. 399 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్‌కు రెండంటే రెండే అసెంబ్లీ స్థానాలు దక్కాయి. యుపిలో మా పార్టీకున్న సంస్థాగత బలం, ఇటీవల పెరిగిన మా నాయకుడు రాహుల్ గాంధీ ఇమేజ్ ప్రాతిపదికన మాకు 'గౌరవప్రదమైన' స్థానాలు ఇవ్వాల్సిందే' అని ఎఐసిసి నాయకుడు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ రాజేంద్ర పాల్ గౌతమ్ అంటున్నారు. ఇది ఎస్‌పి నాయకత్వానికి నచ్చట్లేదు. వారి ఓటమి అందరికీ నష్టం ఉత్తరాది రాష్ట్రాల పొత్తుల్లో కాంగ్రెస్ గెలుపు నిష్పత్తి (సక్సెస్ రేట్) తక్కువగా ఉండటం ఇతర భాగస్వామ్య పార్టీల అవకాశాలను దెబ్బతీస్తోంది. పొత్తు చర్చల్లో గీచి గీచి బేరాలు చేసి ఎక్కువ సీట్లు తీసుకోవడం, తక్కువ సీట్లు నెగ్గడం కాంగ్రెస్‌కు రివాజయింది. 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'మహాఘట్ బంధన్' తరపున తేజస్వీ యాదవ్ (ఆర్‌జెడి) ముఖ్యమంత్రి కాకుండా పోవడానికి కాంగ్రెస్ గెలుపు నిష్పత్తి తక్కువగా ఉండటమే కారణమన్నది ఎవరూ కాదనలేని సత్యం. 243 స్థానాల అసెంబ్లీలో 122 మ్యాజిక్ నంబర్. కూటమి 110 స్థానాల వద్ద వచ్చి ఆగింది. పోటీ చేసిన 144లో 75 ఆర్‌జెడి గెలిస్తే 19లో 12 సిపిఐ (ఎంఎల్), 6లో 2 సిపిఐ, 4లో 2 సిపిఎం నెగ్గాయి. కానీ, బెట్టుచేసి 70 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 19 చోట్ల మాత్రమే నెగ్గింది. ఇటువంటి అనుభవాలు ఉత్తరప్రదేశ్‌లోనూ తక్కువేమీ లేవు. అందుకే, కాంగ్రెస్‌కు గెలుపు అవకాశాల్నిబట్టి స్థానాలు ఇస్తాం తప్ప వారి కోరినన్ని కాదు అన్నది ఎస్‌పి నాయకత్వ భావన. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ, బిజెపిని మానసికంగా ఎంతో కృంగదీసే ఫలితాలు ఇండియా కూటమి సాధించినప్పుడు కూడా కాంగ్రెస్ విజయశాతం తక్కువే! 62 చోట్ల పోటీ చేసిన ఎస్‌పి 37 చోట్ల (సగానికి పైగా) నెగ్గితే, 17 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 6 స్థానాల్లో (దాదాపు మూడో వంతు స్థానాల్లో)నే నెగ్గింది. ఎస్‌పి మెరుగైన ఫలితాలు సాధించడం వల్లే మొత్తానికి కూటమికి ఎన్‌డిఎ పక్షాల పైన ఆధిపత్యం (43/80) దక్కింది. 'ఎక్కువ సీట్లు తీసుకొని బలహీనమైన అభ్యర్థుల్ని కాంగ్రెస్ నిలబెడితే ప్రత్యర్థులకు మేలు జరుగుతుంది. దాని వల్ల కాంగ్రెస్‌కు, ఎస్‌పికి మాత్రమే కాదు, మొత్తం ఇండియా కూటమికే తీరని నష్టం' అని పార్టీ నాయకులతో ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నట్టు తెలుస్తోంది. అందుకే ఆయన, ఇన్ని సీట్లు కావాలి అనకుండా, ముందు ఎక్కడెక్కడ 'గెలువదగ్గ అభ్యర్థులు'న్నారో జాబితా ఇమ్మని కాంగ్రెస్ వారిని అడుగుతున్నారు. దాన్ని బట్టి కాంగ్రెస్‌కు ఎన్ని స్థానాలు ఇవ్వొచ్చన్నది నిర్ణయించాలని ఎస్‌పి భావిస్తోంది. 'సీట్ల సంఖ్యపై బెట్టు కాదు గానీ, పార్టీకి బలమైన సంస్థాగత నిర్మాణం, గట్టి అభ్యర్థులు ఎక్కడున్నారో చెబుతూ చర్చల ప్రక్రియ ప్రారంభిద్దాం' అని పార్టీ వర్గీయులతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వదేరా అన్నట్టు వార్తలొచ్చాయి. అక్టోబరు 19న ప్రియాంక సమక్షంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరాధన మిశ్రా, ఇటీవలే పార్టీ రాష్ట్ర 'వర్కింగ్ ప్రెసిడెంట్'గా బాధ్యతలు చేపట్టిన ఇమ్రాన్ మసూద్ (శహరాన్‌పూర్ ఎంపి), రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. చర్చల ప్రక్రియ నిర్మాణాత్మకంగా, సయోధ్య పూరితంగా ఉండాలని ఆమె వారికి సూచించారు. కానీ, బయట అందుకు భిన్నంగా 'సమాన గౌరవం సమాన వాటా' అనే వాదాన్ని ఇమ్రాన్ మసూద్ ఎత్తుకున్నారు. '150 అని ఎవరన్నారు? నా అంచనాల్లో మాకు 200 స్థానాలు ఇవ్వాల్సి ఉంటుంది' అని ఒక మీడియా సమావేశంలో ఇంచార్జ్ రాజేంద్రపాల్ గౌతమ్ అనటాన్ని ఎస్‌పి నాయకులు తప్పుబడుతున్నారు. చర్చల ప్రక్రియ ఓ కొలిక్కి రాకుండానే సీట్ల సంఖ్య, నిర్హేతుకమైన డిమాండ్లను మీడియాలో చెప్పుకోవడం సరికాదన్నది వారి వాదన. అంతకు ముందు, అక్టోబర్ 13న రాహుల్ గాంధీ వద్ద జరిగిన 'చాయ్ భేటీ'లో ఎస్‌పి సీనియర్ ఎం.పి రాజీవ్‌రాయ్ ఒక మాట ప్రియాంకకు చెప్పారు. 'ఇన్ని నియోజకవర్గాలు అనే లెక్క -జాబితా కాదు గానీ, గెలుపు అవకాశాలు గల అభ్యర్థులు కాంగ్రెస్‌కు ఎక్కడెక్కడ ఉన్నారు, వారి పేర్లతో జాబితా ఇవ్వండి' అని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీలో వేడి పుట్టించింది. 'అలా ఎవరైనా ముందే జాబితా ఇస్తారా? దేశంలో ఎక్కడా జరుగదు. ముందు నియోజకవర్గాలు తేలాలి' అన్నది కాంగ్రెస్ ఆలోచనగా ఉంది. లోగడ ఒక ఎన్నికలో కూటమి తరపున తాను స్వయంగా ప్రచార బరిలో దిగుతానని ప్రియాంక గాంధీ మాటిస్తే, వంద స్థానాలు కాంగ్రెస్‌కు ఇచ్చి భంగపోయిన అనుభవం ఎస్‌పిది. సీట్లు కేటాయించిన తర్వాత ఎన్నిమార్లు ఫోన్ చేసినా సదరు నాయకురాలు స్పందించనే లేదని ఎస్‌పి సమావేశాల్లో అఖిలేశ్ యాదవ్ స్వయంగా వెల్లడించారు. 2022 ఎన్నికల్లో 'మై లడికీ హూ, లడ్ సక్తీ హూ' అని ప్రియాంక ప్రచారం చేసినా ఫలితాలు మాత్రం (2/399) ఘోరంగా వెక్కిరించాయన్నది ఎస్‌పి వర్గాల ఆవేదన. అందుకే, కాంగ్రెస్‌కు ఇచ్చేవి 60- 80 స్థానాల మధ్య ఎక్కడో గిరి గీయాలన్నది వారి ఆలోచన. బెట్టు చేసి, బేరమాడి 80 -100 మధ్య ఏదో సంఖ్యను ఖరారు చేసుకోవాలని కాంగ్రెస్ తాపత్రయం. ఉమ్మడి లక్ష్యమే వారిని కట్టివుంచాలి ఎటు తిరిగి ఈ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలనే ఉమ్మడి లక్ష్యమే ఎస్‌పి, కాంగ్రెస్‌ను కట్టిపడేసేది. యుపిలో కూట మి పెద్దన్నగా ఎస్‌ఫి అధినేతకు 'పెద్దమనసుండాల'ని కాంగ్రెస్ వాదులు చెబుతున్నా 'ఇండియా కూటమి' దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీయే 'ఇచ్చిపుచ్చుకునే ధోరణి'తో ఉండాలని ఎస్‌పి వర్గాలంటున్నాయి. పొత్తుల్లో తమకు కేటాయించమని కాంగ్రెస్ వారు ప్రతిపాదించే 180 స్థానాల జాబితాలో, 12 ఎస్‌పి సిట్టింగ్ ఎంఎల్‌ఎ స్థానాలుండటాన్ని వారు ఎత్తిచూపుతున్నారు. ఇదేనా పొత్తు పద్ధతి? అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్‌తో పొత్తు లేకుండానే కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌పి 36 శాతం ఓటు వాటాతో 111 స్థానాలు సొంతంగా నెగ్గింది. 55 స్థానాల్లో బిజెపి 5వేల లోపు ఓట్ల వ్యత్యాసంతో గెలిచింది. 5వేల వరకు వ్యత్యాసపు సీట్లు 23, 3వేల లోపువి 3, 2వేల లోపువి 11, వెయ్యిలోపువి 11, 500లోపు ఓట్ల వ్యత్యాసంతో గెలిచిన స్థానాలు 7, ఇలా మొత్తం 55 ఉన్నాయి. ఈ గణాంకాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలు, గత పదమూడేళ్లలో ఇప్పుడే బిజెపికి ఎదురవుతున్న అత్యధిక వ్యతిరేకత... వీటన్నిటిని సానుకూలంగా మలచుకోవడానికి ముందు కావాల్సింది యుపిలో ఎస్‌పికాంగ్రెస్ మధ్య సయోధ్య!

యువతరం కదిలింది!

భవిష్యత్తుపై నమ్మకం సన్నగిల్లితే యువత రాజకీయాలను ప్రశ్నిస్తుంది. అవకాశాలకు అన్యాయం జరుగుతోందని భావిస్తే వీధుల్లోకి వస్తుంది. శ్రీలంక నుంచి సెర్బియా వరకు సాగిన ఉద్యమాల్లో ఈ ధోరణి కనిపిస్తోంది. జీవన వ్యయం, నిరుద్యోగం, అవినీతి వేర్వేరు సమస్యలుగా కనిపించినా, వాటి వెనుక సమాన అవకాశాలు కావాలన్న ఆకాంక్ష ఉంది. తమ జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాల్లో తమ మాటకు విలువ ఉండాలన్న పట్టుదల ఉంది. 2022లో శ్రీలంక ఆర్థిక సంక్షోభం 'అరగాలయ' ఉద్యమానికి దారితీసింది. ఆహారం, ఇంధనం కొరతపై మొదలైన ప్రజాగ్రహంతో అధ్యక్షుడు గోటబయ రాజపక్సే దేశం విడిచారు. అయితే వెంటనే అధికారంలోకి వచ్చింది ఉద్యమ యువత కాదు. పార్లమెంటు ఎన్నుకున్న రణిల్ విక్రమసింఘే. పాలకుడిని తొలగించడం, పాలనా వ్యవస్థను మార్చడం వేర్వేరని ఈ పరిణామం చూపించింది. 2024లో కెన్యా యువత పన్నుల పెంపును ప్రతిఘటించింది. నిరసనలతో అధ్యక్షుడు విలియం రూటో వివాదాస్పద ఆర్థిక బిల్లును ఉపసంహరించుకున్నారు. అది విధానంపై విజయం. అదే ఏడాది బంగ్లాదేశ్‌లో ఉద్యోగ కోటాలపై విద్యార్థుల పోరాటం, అణచివేత నేపథ్యంలో ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమమైంది. షేక్ హసీనా నిష్క్రమణతో ఆమె సుదీర్ఘ పాలన ముగిసింది. రెండు దేశాల్లో యువత ముందున్నా, ఫలితాలు ఒకేలా లేవు. 2025లో నేపాల్‌లో సామాజిక మాధ్యమాల నిషేధం ఉద్యమానికి తక్షణ కారణమైంది.

అవినీతి, బంధుప్రీతి, ఉపాధి కొరతపై పేరుకుపోయిన ఆగ్రహం దానికి బలమిచ్చింది. నిషేధం ఎత్తివేసినా నిరసనలు ఆగలేదు. ప్రధాని కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు. సమాచార ప్రవాహాన్ని అడ్డుకోవడం ద్వారా అసంతృప్తిని తొలగించలేమని ఈ అనుభవం సూచిస్తోంది.

భారత్‌లోనూ పరీక్షా పత్రాల లీకులపై యువత ఆందోళనలు నిర్వహించింది. తాజాగా ఓటర్ల జాబితాల సవరణను ప్రశ్నిస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ' యువ ఉద్యమం నిరసనలకు పిలుపునిచ్చింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా కోరిన ఆందోళనల సందర్భంగా ఢిల్లీలో రెండువేల మందికిపైగా నిర్బంధించినట్లు రాయిటర్స్ తెలిపింది. జాబితాల సవరణలో అక్రమాల ఆరోపణలను ఎన్నికల సంఘం, బిజెపి ఖండించాయి. ఈ వివాదం ప్రజాసంస్థల విశ్వసనీయతపై చర్చను ముందుకు తెచ్చింది. సెర్బియాలో మాత్రం నిరసన ఎన్నికల ప్రత్యామ్నాయంగా ఎదిగింది.ద

నోవిసాద్ రైల్వేస్టేషన్ ప్రమాదంలో 16మంది మరణించడంపై జవాబుదారీతనం కోరిన ఉద్యమం దీనికి పునాది. తాజా లెక్కింపులో విద్యార్థుల మద్దతుగల జాబితా 250 స్థానాల్లో 139 సాధించింది. అందులో అధ్యాపకులు, ఇతర వృత్తులవారూ ఉన్నారు. ప్రభుత్వ ఏర్పాటు, నాయకత్వంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ పరిణామాలన్నింటినీ ఒకే ప్రపంచ విప్లవంగా చూడలేం. దేశాల పరిస్థితులు, డిమాండ్లు, ప్రజాస్వామ్య అవకాశాలు వేరు. సామాజిక మాధ్యమాలు సమీకరణను వేగవంతం చేస్తాయి. కానీ అవే ఉపాధిని సృష్టించవు. పరిపాలనా సామర్థ్యాన్ని అందించవు. ఆగ్రహాన్ని ఆచరణయోగ్యమైన విధానాలుగా మార్చేందుకు విస్తృత ప్రజామద్దతు, స్పష్టమైన కార్యక్రమం అవసరం. భారత్‌కూ ఇందులో పాఠముంది. యువతను కేవలం ఓటు బ్యాంకుగా చూడకూడదు. పరీక్షల్లో న్యాయం, నియామకాల్లో పారదర్శకత, ఎన్నికలపై నమ్మకం కల్పించాలి. నిరసనలను వినడం పాలనా బలహీనత కాదు. సమస్యలు ముదరక ముందే పరిష్కరించే ప్రజాస్వామ్య సామర్థ్యం. కొత్త నాయకులకూ ఇదే పరీక్ష వర్తిస్తుంది. అధికార మార్పు ప్రజల అవకాశాలను పెంచినప్పుడే ఉద్యమ విజయం సార్థకమవుతుంది.

ముంబై ఇండియన్స్‌లో ప్రక్షాళన!

లసిత్ మలింగ సహా ముగ్గురు కోచ్‌లకు ఉద్వాసన
వచ్చే సీజన్‌పై గురి.. కొత్త కోచ్‌ల నియామకంపై ఆసక్తి

ముంబై, అక్టోబర్ 29: ఐదుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టు వచ్చే సీజన్‌లో విజయాల బాట పట్టేందుకు ఇప్పటి నుంచే ప్రక్షాళన చేపట్టింది. 2026 సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఆ జట్టు, తన సహాయక సిబ్బందిలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా శ్రీలంక క్రికెట్ దిగ్గజం, మాజీ ఆటగాడు లసిత్ మలింగతో పాటు మరో ఇద్దరు కోచ్‌లతో సంబంధాలను తెంచుకుంది. బౌలింగ్ కోచ్‌లు లసిత్ మలింగ, పరాస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ కార్ల్ హాప్కిన్సన్ ఇకపై జట్టు కోచింగ్ విభాగంలో కొనసాగబోరని ముంబై ఇండియన్స్ గురువారం ప్రకటించింది. **కొత్త దిశగా ముంబై ఇండియన్స్ అడుగులు** ఇటీవల ముగిసిన ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టు తీవ్ర నిరాశపరిచింది. ఐదుసార్లు టైటిల్ సాధించిన జట్టు, 2026 సీజన్‌లో పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఫలితంగా మరోసారి జట్టును పునర్నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే ప్రధాన కోచ్ మహేలా జయవర్ధనే స్థానంలో మాజీ కెప్టెన్ కీరన్ పొలార్డ్‌ను నియమించింది. ఇప్పుడు సహాయక కోచింగ్ సిబ్బందిలోనూ మార్పులు చేపట్టింది. రాబోయే 2027 ఐపీఎల్ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలనే లక్ష్యంతో యాజమాన్యం ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. **మలింగతో ముగిసిన సుదీర్ఘ అనుబంధం** శ్రీలంకకు చెందిన దిగ్గజ వేగవంతమైన బౌలర్ లసిత్ మలింగకు ముంబై ఇండియన్స్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. 2009 నుంచి 2019 వరకు ముంబై జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మలింగ, తన బౌలింగ్‌తో ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించాడు. యార్కర్లతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టడంలో పేరుగాంచిన అతడు, ముంబై

ఇండియన్స్ నాలుగు ఐపీఎల్ టైటిళ్లు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. 2011లో ఛాంపియన్స్ లీగ్ టీ20 విజయంలోనూ భాగస్వామిగా నిలిచాడు. ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత తిరిగి అదే జట్టులో మెంటార్‌గా, బౌలింగ్ కోచ్‌గా సేవలందించాడు. 2024 నుంచి 2026 వరకు బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. ఇప్పుడు అతడి నిష్క్రమణతో ముంబైతో కొనసాగిన సుదీర్ఘ ప్రయాణానికి తెరపడింది. **పరాస్ మాంబ్రే, హాప్కిన్సన్‌కు వీడ్కోలు** మలింగతో పాటు పరాస్ మాంబ్రే, కార్ల్ హాప్కిన్సన్ కూడా ముంబై ఇండియన్స్ కోచింగ్ బృందం నుంచి వైదొలిగారు. పరాస్ మాంబ్రేకు ముంబై జట్టుతో గతంలోనూ అనుబంధం ఉంది. 2010 నుంచి 2017 వరకు జట్టుతో కలిసి పనిచేసిన ఆయన, 2024లో తిరిగి ఫ్రాంచైజీలో చేరారు. యువ బౌలర్లను తీర్చిదిద్దడంలో, జట్టు బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేయడంలో ఆయన సేవలు అందించారు. ఇక కార్ల్ హాప్కిన్సన్ 2025 సీజన్‌కు ముందు ముంబై జట్టులో ఫీల్డింగ్ కోచ్‌గా చేరారు.

భువనేశ్వర్‌కు ఉద్వాసన తప్పదా?

- అశ్విన్ కీలక వ్యాఖ్యలు.. మయాంక్ యాదవ్ లేదా స్పిన్నర్‌కు అవకాశం!
- న్యూజిలాండ్‌తో చివరి రెండు టీ20ల్లో మార్పులు తప్పవా?
- మూడు మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్టే.. 11.58 ఎకానమీతో ఇబ్బందులు

భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ జట్టులో స్థానం మరోసారి చర్చనీయాంశంగా మారింది. దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత భారత జట్టులోకి తిరిగి వచ్చిన అతడు, న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. దీంతో రానున్న మ్యాచ్‌ల్లో అతడికి తుది జట్టులో చోటు దక్కుతుందా? లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. భువనేశ్వర్ స్థానంలో యువ పేసర్ మయాంక్ యాదవ్ లేదా మరో స్పిన్నర్‌కు అవకాశం కల్పించవచ్చని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. **భువీ స్థానంలో కొత్త ఆటగాడికి అవకాశం?** న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ ఇప్పటికే తొలి మూడు మ్యాచ్‌లను గెలుచుకుని సిరీస్‌ను సొంతం చేసుకుంది. దీంతో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఆటగాళ్లకు విశ్రాంతి కల్పించడం, ఇతర ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వడంపై జట్టు యాజమాన్యం దృష్టి సారించే అవకాశం ఉంది. ఈ అంశంపై అశ్విన్ తన యూట్యూబ్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. భువనేశ్వర్ ఇప్పటివరకు బౌలింగ్ చేసిన తీరును పరిశీలిస్తే, అతడి స్థానంలో స్పిన్నర్ లేదా మయాంక్ యాదవ్ ఆడే అవకాశం ఉందని పేర్కొన్నాడు. అలాంటి మార్పు జరిగితే తాను ఆశ్చర్యపోనని తెలిపాడు. **మూడు మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్టే!** భువనేశ్వర్ కుమార్ తిరిగి జట్టులోకి వచ్చిన తర్వాత తొలి మూడు టీ20 మ్యాచ్‌ల్లోనూ ఆడాడు. అయితే, ఈ మూడు మ్యాచ్‌ల్లో కలిపి అతడు ఒక్క వికెట్ మాత్రమే సాధించాడు.

అంతేకాకుండా, ఓవర్‌కు సగటున 11.58 పరుగులు సమర్పించుకున్నాడు. టీ20 క్రికెట్‌లో ప్రత్యర్థి పరుగుల వేగాన్ని నియంత్రించడం బౌలర్లకు అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో భువనేశ్వర్ ప్రదర్శనపై విశ్లేషణలు మొదలయ్యాయి. అయితే, గతంలో కొత్త బంతితో స్వింగ్ రాబడుతూ, కీలక సమయాల్లో వికెట్లు తీసిన అనుభవం అతడికి ఉంది. కాబట్టి ప్రస్తుత గణాంకాల ఆధారంగా అతడి భవిష్యత్తుపై ఇప్పుడే తుది నిర్ణయానికి రావడం సరికాదనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. **మయాంక్ యాదవ్‌కు మరో అవకాశం?** యువ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో అతడి బౌలింగ్ ప్రదర్శన ఆకట్టుకుంది. అయినప్పటికీ, తర్వాతి మ్యాచ్‌ల్లో అతడికి అవకాశం దక్కలేదు. అతడి స్థానంలో ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం కల్పించారు. ఇప్పుడు భువనేశ్వర్ ప్రదర్శన నేపథ్యంలో మయాంక్‌ను తిరిగి తుది జట్టులోకి తీసుకోవచ్చనే చర్చ జరుగుతోంది. మయాంక్ వేగవంతమైన బంతులతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలడు. మరోవైపు, అనుభవజ్ఞులైన స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి కూడా ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఆడే అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. **మైదానాల పరిమాణం కూడా కీలకమే!** భారత జట్టు ఎంపికపై అశ్విన్ మరో ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించాడు.

వారికన్ స్పిన్ మాయాజాలం..
బంగ్లాదేశ్ విలవిల!

- ఐదు వికెట్లతో వెస్టిండీస్‌కు ఆధిక్యం.. 272 పరుగులకే ప్రత్యర్థి ఆలౌట్
- శతకంతో సత్తాచాటిన షాద్మన్ ఇస్లాం.. రెండో రోజు ఆటలో ఉత్కంఠ

మిర్పూర్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో వెస్టిండీస్ ఎడమచేతి వాటం స్పిన్నర్ జోమెల్ వారికన్ తన బౌలింగ్ ప్రతిభతో అదరగొట్టాడు. ప్రత్యర్థి బ్యాటర్లను తన స్పిన్ ఉచ్చులో బిగించి ఐదు వికెట్లు పడగొట్టాడు. అతడి అద్భుత ప్రదర్శనతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 272 పరుగులకే ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. దీంతో బంగ్లాదేశ్ కంటే ఇంకా 138 పరుగులు వెనుకబడి ఉంది. **శతకంతో మెరిసిన షాద్మన్ ఇస్లాం** ఓవర్‌నైట్ స్కోరు 213/3తో రెండో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లాదేశ్‌కు ఓపెనర్ షాద్మన్ ఇస్లాం అండగా నిలిచాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 99 పరుగులతో అజేయంగా ఉన్న అతడు, రెండో రోజు ఆరంభంలోనే తన టెస్టు కెరీర్‌లో మూడో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అయితే, జట్టు స్కోరు 221 పరుగుల వద్ద ఉన్నప్పుడు 105 పరుగులు చేసిన షాద్మన్‌ను జాషువా బిషప్ ఎల్బీడబ్ల్యూ ద్వారా వెనక్కి పంపాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన తోహిద్ హృదయ్ 42 పరుగుల వద్దే వెనుదిరిగాడు. దీంతో బంగ్లాదేశ్ బ్యాటింగ్ పతనం మొదలైంది. **కుప్పకూలిన బంగ్లాదేశ్ బ్యాటింగ్ విభాగం** ఒక దశలో పటిష్ఠ స్థితిలో కనిపించిన బంగ్లాదేశ్ జట్టు, కీలక సమయంలో వరుసగా వికెట్లు కోల్పోయింది. మెహిదీ హసన్ మిరాజ్ 15 పరుగులు చేయగా, మాజీ కెప్టెన్ మొమినుల్ హక్ 28 పరుగులు సాధించాడు. కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో 19 పరుగులకే పరిమితమయ్యాడు. వికెట్ కీపర్ బ్యాటర్ లిటన్ దాస్ మాత్రం 34 పరుగులతో నాటౌట్‌గా నిలిచి పోరాడాడు. అయితే, మిగిలిన బ్యాటర్లు పెద్దగా రాణించకపోవడంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ 97.4 ఓవర్లలో 272 పరుగుల వద్ద ముగిసింది. **వారికన్ ఐదు వికెట్ల ప్రదర్శన** వెస్టిండీస్ బౌలర్లలో జోమెల్ వారికన్ 53 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. టెస్టు క్రికెట్‌లో అతడికి ఇది నాలుగో ఐదు వికెట్ల ఘనత. అరంగేట్ర టెస్టు ఆడుతున్న జాషువా బిషప్ 61 పరుగులిచ్చి రెండు వికెట్లు సాధించగా, షమర్ జోసెఫ్ 41 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. వారికన్ కీలక సమయాల్లో వికెట్లు తీసి బంగ్లాదేశ్ భారీ స్కోరు సాధించే అవకాశాలను దెబ్బతీశాడు. చివరి ఐదు వికెట్లను కేవలం 19 పరుగుల వ్యవధిలో కోల్పోవడం బంగ్లాదేశ్ బ్యాటింగ్ వైఫల్యానికి అద్దం పట్టింది. **తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ పోరాటం** బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ ముగిసిన అనంతరం బరిలోకి దిగిన వెస్టిండీస్ ఆరంభంలో దూకుడుగా ఆడింది. అయితే, బ్రాండన్ కింగ్ 15 పరుగుల వద్ద ఔటవడంతో తొలి వికెట్ కోల్పోయింది. మరోవైపు జాన్ క్యాంప్‌బెల్ ధాటిగా ఆడి 54 పరుగులు సాధించాడు. అతడిని మెహిదీ హసన్ మిరాజ్ పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత బంగ్లాదేశ్ బౌలర్లు పుంజుకున్నారు. తైజుల్ ఇస్లాం ఒకే ఓవర్లో కావెమ్ హాడ్జ్ (7), అమీర్ జంగూ (0) వికెట్లు తీసి వెస్టిండీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. **రెండో రోజు ఆటకు వర్షం, వెలుతురు అంతరాయం** ఒక దశలో 90/1తో మెరుగైన స్థితిలో ఉన్న వెస్టిండీస్ 97 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, టజెనరైన్ చంద్రపాల్ 43 పరుగులతో అజేయంగా నిలవగా, జస్టిన్ గ్రీవ్స్ 15 పరుగులతో అతడికి అండగా నిలిచాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును కొంతవరకు నిలబెట్టారు. వర్షం కారణంగా ఆటకు అంతరాయం కలగడంతో పాటు, వెలుతురు సరిగా లేకపోవడంతో రెండో రోజు ఆట ముందుగానే ముగిసింది. ప్రస్తుతం వెస్టిండీస్ 138 పరుగుల వెనుకంజలో ఉండగా, మూడో రోజు ఆట ఇరు జట్లకు కీలకం కానుంది.

డబ్లిన్ విమానాశ్రయంలో వివక్ష!

కుటుంబంతో కలిసి వెళ్లినప్పుడు చేదు అనుభవం ఎదురైంది
విమానయాన సంస్థ సిబ్బందిపై శ్రీలంక క్రికెట్ దిగ్గజం కుమార సంగక్కర ఆరోపణలు

శ్రీలంక క్రికెట్ మాజీ కెప్టెన్, దిగ్గజ బ్యాటర్ కుమార సంగక్కర ఐర్లాండ్‌లోని డబ్లిన్ విమానాశ్రయంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించాడు. విమానయాన సంస్థ ర్యాన్‌ఎయిర్ సిబ్బంది తనతో పాటు తన కుటుంబ సభ్యుల పట్ల వివక్షపూరితంగా, బెదిరింపులకు దిగినట్లుగా ప్రవర్తించారని ఆరోపించాడు. సిబ్బంది మాట్లాడిన తీరు, విమాన ప్రయాణానికి సంబంధించిన నిబంధనలను అమలు చేసిన విధానం తనను తీవ్రంగా కలచివేశాయని పేర్కొన్నాడు. ఏ ప్రయాణికుడికైనా ఇలాంటి అనుభవం ఎదురుకావడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశాడు. **సామాజిక మాధ్యమంలో సంగక్కర ఆవేదన** బుధవారం (అక్టోబర్ 28) సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా సంగక్కర తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. డబ్లిన్‌లో ర్యాన్‌ఎయిర్ విమానయాన సంస్థ గేట్ సిబ్బంది నుంచి ఇతర ప్రయాణికులు

కూడా ఇలాంటి వివక్షపూరిత ప్రవర్తనను ఎదుర్కొన్నారా? అని ప్రశ్నించాడు. తన కుటుంబంతో కలిసి ప్రయాణిస్తున్న సమయంలో ఎదురైన అనుభవం దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపాడు. సిబ్బంది మాట్లాడిన తీరు, విధానాలను సక్రమంగా అమలు చేయకపోవడం, బెదిరింపులతో కూడిన ప్రవర్తన తనను బాధించాయని పేర్కొన్నాడు. డబ్లిన్‌లో తనకు ఎదురైన తొలి చేదు అనుభవం ఇదేనని వెల్లడించాడు. **మరో శ్రీలంక ప్రముఖుడి స్పందన** సంగక్కర చేసిన వ్యాఖ్యలపై శ్రీలంకకు చెందిన సంజీవ వీరవర్ణ స్పందించాడు. పాశ్చాత్య దేశాల్లో నివసిస్తున్నప్పుడు, ప్రయాణాలు చేస్తున్నప్పుడు తాను కూడా అనేక సందర్భాల్లో వివక్షను ఎదుర్కొన్నానని పేర్కొన్నాడు. దాదాపు 16 సంవత్సరాలు అక్కడ నివసించానని, ఆ తర్వాత కూడా 25 సంవత్సరాల పాటు రాకపోకలు సాగించానని తెలిపాడు. తన అనుభవాల కారణంగా అవసరం ఉంటే తప్ప ఇకపై ఆ దేశాలకు ప్రయాణించాలనే ఆసక్తి లేదని వ్యాఖ్యానించాడు. దీనిపై సంగక్కర స్పందిస్తూ, స్వయంగా ఇలాంటి అనుభవాన్ని ఎదుర్కొన్నప్పుడు మనసును తీవ్రంగా కలచివేస్తుందని పేర్కొన్నాడు. **ర్యాన్‌ఎయిర్ స్పందన కోసం ఎదురుచూపులు** డబ్లిన్ విమానాశ్రయంలో జరిగినట్లు సంగక్కర ఆరోపించిన ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు. సిబ్బందితో వాగ్వాదం జరగడానికి దారితీసిన పరిస్థితులపై కూడా ఆయన స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు, ఈ ఆరోపణలపై ర్యాన్‌ఎయిర్ సంస్థ నుంచి అధికారిక స్పందన వెలువడినట్లు వార్తా కథనాల్లో సమాచారం లేదు. ఈ వ్యవహారం విమానాశ్రయాల్లో ప్రయాణికులతో సిబ్బంది వ్యవహరించే తీరుపై చర్చకు దారితీసింది. **శ్రీలంక క్రికెట్‌లో సంగక్కరకు ప్రత్యేక గుర్తింపు** కుమార సంగక్కర శ్రీలంక క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. వికెట్ కీపర్ బ్యాటర్‌గా, జట్టు కెప్టెన్‌గా దేశానికి ఎన్నో విజయాలను అందించాడు. 2015లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆయన, టెస్టుల్లో 12,400 పరుగులు, వన్డేల్లో 14,234 పరుగులు సాధించాడు.

టీమిండియా విజయాల్లో బౌలర్లదే కీలక పాత్ర!

ప్రిన్స్ యాదవ్ యార్కర్లపై తిలక్ వర్మ ప్రశంసలు
న్యూజిలాండ్‌పై 5-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ లక్ష్యం

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత బౌలర్లు అద్భుతంగా రాణిస్తున్నారని యువ బ్యాటర్ తిలక్ వర్మ ప్రశంసించాడు. ముఖ్యంగా కీలక సమయాల్లో ప్రిన్స్ యాదవ్ సంధిస్తున్న యార్కర్లు జట్టుకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నాడు. వరుసగా మూడు విజయాలతో సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్, మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి 5-0తో సిరీస్‌ను ముగించాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపాడు. **కీలక సమయాల్లో బౌలర్ల సత్తా** ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌లూ అధిక స్కోర్లతో సాగినప్పటికీ భారత బౌలర్లు ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొన్నారని తిలక్ వెల్లడించాడు. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో, చివరి ఓవర్లలో బౌలర్లు చూపుతున్న క్రమశిక్షణ జట్టు విజయాల్లో కీలకంగా మారిందని తెలిపాడు. ప్రిన్స్ యాదవ్ ఒత్తిడిలోనూ కచ్చితమైన యార్కర్లు వేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయడం సానుకూల అంశమని కొనియాడాడు. **మైదానం చిన్నదైనా భయం లేదు** నాలుగో టీ20 జరగనున్న ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ మైదానంలో నేరుగా ఉండే బౌండరీలు చిన్నవిగా ఉంటాయని విన్నానని తిలక్ చెప్పాడు. ఇలాంటి మైదానాల్లో బౌలర్లు మరింత జాగ్రత్తగా బంతులు వేయాల్సి

ఉంటుందని అభిప్రాయపడ్డాడు. అయితే మైదానం పరిమాణం కంటే పిచ్ పరిస్థితులు ముఖ్యమని పేర్కొన్నాడు. కీలక సమయాల్లో యార్కర్లు సంధించడం, ప్రత్యర్థి పరుగుల వేగాన్ని నియంత్రించడం విజయానికి అవసరమని తెలిపాడు. **ప్రయాణాల అలసటను సాకుగా చూపం** వరుస పర్యటనల కారణంగా ఆటగాళ్లకు విశ్రాంతి సమయం తక్కువగా లభిస్తున్నప్పటికీ, అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్నప్పుడు అలసటను సాకుగా చూపకూడదని తిలక్ స్పష్టం చేశాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్, జింబాబ్వే, జపాన్ పర్యటనల అనంతరం న్యూజిలాండ్‌కు రావడంతో సమయ వ్యత్యాసాలకు అలవాటు పడటం కూడా సవాలుగా మారిందని తెలిపాడు. అయినప్పటికీ ప్రతి ఆటగాడు మానసికంగా సిద్ధమై అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని పేర్కొన్నాడు. కోచ్ గౌతమ్ గంభీర్ సూచించినట్లుగా, టీ20ల్లో నెలకొల్పే ప్రమాణాలు వన్డేలు, టెస్టుల్లోనూ ఉపయోగపడతాయని వివరించాడు. **బౌలింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్నా** తాను కూడా నెట్స్‌లో బౌలింగ్ సాధన కొనసాగిస్తున్నానని తిలక్ వెల్లడించాడు. ప్రస్తుతం నమన్ ధీర్ బంతితోనూ రాణిస్తున్నాడని, జట్టు అతడి సేవలను సమర్థంగా ఉపయోగించుకుంటోందని పేర్కొన్నాడు. తనకు అవకాశం వచ్చినప్పుడు బౌలింగ్‌తో జట్టుకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపాడు.

నెట్‌ఫ్లిక్స్‌లో చిరంజీవి 'మెగావర్స్' టాక్ షో..

షూటింగ్ ప్రారంభం

వెండితెరపై దశాబ్దాలుగా తన నటనతో కోట్లాది మందిని అలరిస్తున్న మెగాస్టార్ చిరంజీవి, ఇప్పుడు సరికొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. తన సుదీర్ఘ కెరీర్‌లో మరో వినూత్న అధ్యాయాన్ని మొదలుపెడుతూ, గ్లోబల్ స్ట్రీమింగ్ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ కోసం ఒక ప్రత్యేకమైన టాక్ షోతో అలరించబోతున్నారు. 'మెగావర్స్' పేరుతో రూపొందుతున్న ఈ షోతో ఆయన డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. ప్రస్తుతం ఈ షో షూటింగ్ ప్రారంభమైంది.

భారతీయ సినిమా గొప్ప వారసత్వాన్ని, సినీ ప్రముఖుల జీవితంలోని ఆసక్తికరమైన ఘట్టాలను ప్రేక్షకులకు మరింత దగ్గర చేయడమే లక్ష్యంగా 'మెగావర్స్' రూపుదిద్దుకుంటోంది. ఈ షోలో చిరంజీవి తనదైన చరిష్మా, హాస్య చతురత, లోతైన ఆలోచనా విధానంతో ప్రేక్షకులను అలరించనున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, భిన్న తరాలకు చెందిన స్టార్స్‌తో ఆయన ఆసక్తికరమైన సంభాషణలు జరపనున్నారు. అద్భుతమైన కథలు, ఎన్నో కొత్త విషయాల ఆవిష్కరణలతో ఈ షో సాగనుందని నిర్వాహకులు తెలిపారు.తమ అభిమాన తారల జీవిత ప్రయాణాలు, తెర వెనుక కథలు, వారి వ్యక్తిగత అనుభవాలను చిరంజీవి తనదైన శైలిలో ఆవిష్కరించనున్నారు. ఆయన సహజమైన ఆత్మీయత, సందర్భోచితంగా స్పందించే తీరు ఈ షోకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని భావిస్తున్నారు. తరతరాలుగా ప్రేక్షకులతో ప్రత్యేక అనుబంధాన్ని పెనవేసుకున్న చిరంజీవి, ఈ వేదికపై తన ఆకట్టుకునే వ్యక్తిత్వంతో సందడి చేయనున్నారు. ఆయన హోస్టింగ్‌తో ఈ షో మరో స్థాయికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు.

గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆటమ్ మీడియా వెంచర్స్, ఎస్‌ఓఎల్ ప్రొడక్షన్ ఎల్‌ఎల్ పీ సంస్థలు సంయుక్తంగా ఈ షోను నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ షో చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. నెట్‌ఫ్లిక్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న ఈ 'మెగావర్స్'కు సంబంధించిన మరిన్ని వివరాలను, ప్రసార తేదీని త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

ఆ పాత్ర కోసం ప్రాణం పణంగా పెట్టా : రెజీనా కసాండ్రా

నటి రెజీనా కసాండ్రా తన సినీ కెరీర్‌లో తొలిసారిగా ఒక పూర్తిస్థాయి కమర్షియల్ విలన్‌గా నటిస్తున్నట్లు తెలిపారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన 'మూకుత్తి అమ్మన్ 2' చిత్రంలో తాను పోషించిన 'భైరవి' అనే పవర్‌ఫుల్ నెగెటివ్ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించానని ఆమె అన్నారు. ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న రెజీనా పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.ఈ సందర్భంగా దర్శకుడు సుందర్ సి పై రెజీనా ప్రశంసలు కురిపించారు. "గత 30 ఏళ్లుగా తమిళ చిత్ర పరిశ్రమలో ఉంటూ, ఇతర పరిశ్రమలకు వెళ్లకుండానే తమిళ సినిమాను పాన్-ఇండియా స్థాయికి తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి సుందర్ సి. అలాంటి దర్శకుడి సినిమాలో ఇంత బలమైన విలన్ పాత్ర లభించడం సంతోషంగా ఉంది. ఇందులో నయనతారతో నా ఫైట్ సీన్స్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి" అని ధీమా వ్యక్తం చేశారు.2020లో ఘన విజయం సాధించిన 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా రాబోతోంది. సుందర్ సి దర్శకత్వం వహించిన ఈ డివోషనల్ కామెడీ చిత్రాన్ని ఇషారి కె. గణేశ్ నిర్మించారు. ఇందులో నయనతార, ఖుష్బూ, స్నేహ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.సినిమా పూజ నుంచి ప్రీ-రిలీజ్ ఈవెంట్ వరకు ప్రతీది ఎంతో గ్రాండ్‌గా నిర్వహించిన నిర్మాత ఇషారి కె. గణేశ్ కు రెజీనా ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి భారీ బడ్జెట్ మహిళా ప్రాధాన్య చిత్రాలు నిర్మించడం తనలాంటి ఎందరో నటీమణులకు కొత్త ఆశను, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని, కథను నమ్మి ముందుకొచ్చే నిర్మాతలకు అందరూ మద్దతుగా నిలవాలని ఆమె కోరారు.

దర్శకుడిగా మారుతున్న రాహుల్ రామకృష్ణ

'అర్జున్ రెడ్డి', 'జాతిరత్నాలు' వంటి చిత్రాలతో తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించిన విలక్షణ నటుడు రాహుల్ రామకృష్ణ త్వరలో మెగాఫోన్ పట్టబోతున్నారు. నటుడిగా మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ, దర్శకత్వంపై దృష్టి సారించినట్టు ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం తాను నటిస్తున్న 'హుషారు-2' సినిమా పూర్తయిన వెంటనే దర్శకత్వ బాధ్యతలు చేపడతానని వెల్లడించారు.

వచ్చే ఏడాది తన దర్శకత్వంలో సినిమా ఉండొచ్చని రాహుల్ సూచనప్రాయంగా తెలిపారు. ఇది పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని, ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే తానే రాసుకున్నానని చెప్పారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్ట్ కోసం నటీనటుల ఎంపిక కూడా పూర్తయిందని, త్వరలోనే షూటింగ్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలను త్వరలో వెల్లడిస్తామని అన్నారు. కెరీర్ ప్రారంభం నుంచి ఎక్కువగా హీరో ఫ్రెండ్ పాత్రలే రావడం, అవే పాత్రలు పదేపదే చేయాల్సి రావడంతో విసుగు చెందానని, అందుకే దర్శకత్వం వైపు అడుగులు వేస్తున్నానని రాహుల్ వివరించారు. ప్రస్తుతం శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వంలో 'హుషారు-2'లో నటిస్తున్న రాహుల్, దర్శకుడిగా ఎలాంటి వినోదాన్ని పంచుతారో అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

విద్యార్థుల కోసం ఉచిత ఏసీ ట్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్న ధనుష్

ప్రముఖ నటుడు ధనుష్ రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు మరింత బలపడుతున్నాయి. ఇప్పటికే ఆయన తన అభిమాన సంఘాల ద్వారా ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలను చేపట్టారు. తాజాగా, తన సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తూ ఆయన తీసుకున్న ఓ కీలక నిర్ణయం ఇప్పుడు తమిళనాట చర్చనీయాంశంగా మారింది. తన 'ధనుష్ నార్పని ఇయక్కం' (ధనుష్ సంక్షేమ ఉద్యమం) సంస్థ ద్వారా రాష్ట్రంలోని పేద విద్యార్థుల కోసం ఉచితంగా ఏసీ ట్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు.

2027 జనవరి నుంచి ఈ పథకాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి దశలో రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లోనూ 10, 12వ తరగతి విద్యార్థుల కోసం 'స్మార్ట్ స్టడీ హబ్స్' పేరిట ఈ ఏసీ ట్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి కేంద్రంలో ముగ్గురు ఉపాధ్యాయులు, ఒక సహాయకుడిని నియమించనున్నారు. వారి జీతభత్యాలను ధనుష్ సేవా సంస్థనే చెల్లించనుంది.ఇప్పటికే ధనుష్ 'తమిళగ ఎళుచ్చి కళగం' అనే పేరుతో రాజకీయ పార్టీని నమోదు చేశారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన తన అభిమాన సంఘాలను సంక్షేమ సంస్థగా మార్చి సేవా కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఇటీవల సుమారు 3,000 మంది మహిళా సభ్యులతో చెన్నైలో సమావేశం నిర్వహించడం కూడా ఈ ఊహాగానాలకు బలం చేకూర్చింది. అయితే, తన రాజకీయ ప్రవేశంపై ధనుష్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. ఈ విద్యా కార్యక్రమం మాత్రం ఆయన రాజకీయ ఆరంగేట్రానికి బలమైన పునాది వేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

కమర్షియల్ హంగులు లేకుండానే పాన్ ఇండియా క్రేజ్..

సాయి పల్లవి సరికొత్త రికార్డ్!

హీరోయిన్లుగా ఎదగాలంటే గ్లామర్ షో చేయాల్సిన అవసరం లేదని సాయి పల్లవి నిరూపించారు. ఎటువంటి హంగులు ఆర్భాటాలు లేకుండా, కేవలం తన నాచురల్ నటనతోనే ఇండియా మొత్తం తిరుగులేని పాపులారిటీ సంపాదించుకున్నారు. దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'రామాయణం' కోసం సాయి పల్లవి భారీ రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆమె పారితోషికం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆ వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..గ్లామర్ లేదు.. అయినా భారీ పారితోషికం: సాధారణంగా పెద్ద పాన్ ఇండియా సినిమాల్లో హీరోయిన్ల గ్లామర్‌కే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తుంటారు. కానీ సాయి పల్లవి మాత్రం మొదటి నుంచి మేకప్, ఎక్స్‌పోజింగ్‌లకు దూరంగానే ఉంటున్నారు. కేవలం తన నటనతోనే కోట్ల మంది ఫ్యాన్స్ మనసులను గెలుచుకున్నారు. ఇప్పుడు 'రామాయణం' రెండు భాగాల కోసం రూ. 7 కోట్లు తీసుకోవడం ద్వారా, కేవలం నటనను నమ్ముకుని అత్యధిక రీతిలో పారితోషికం పొందే హీరోయిన్లలో ఒకరిగా నిలిచారు. సీతాదేవి పాత్రకు పర్ఫెక్ట్ ఛాయిస్: మన పురాణాల్లో 'సీతాదేవి' పాత్ర చేయడం ఏ నటికైనా చాలా పెద్ద విషయం. ప్రేక్షకుల్లో సీత పాత్రపై ఉన్న గౌరవానికి సాయి పల్లవి రూపం, ప్రవర్తన పర్ఫెక్ట్‌గా సరిపోతాయని డైరెక్టర్ నమ్మారు. ఇక ఎలాంటి గొడవలు, వివాదాలు లేని ఆమె క్లీన్ ఇమేజ్, సింపుల్ లుక్ ఈ క్యారెక్టర్‌కు బాగా సెట్ అవుతాయని అనుకుని ఆమెను ఎంపిక చేశారు. సౌత్ నుంచి నేరుగా బాలీవుడ్ పెద్ద ప్రాజెక్ట్‌లోకి: తెలుగు, తమిళ సినిమాల్లో పక్కింటి అమ్మాయిలా కనిపిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న సాయి పల్లవికి ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంది. ఆమె సినిమాలో ఉందంటే ఆ సినిమాపై అంచనాలు పెరుగుతాయి. అందుకే నార్త్, సౌత్ ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి బాలీవుడ్ మేకర్స్ కూడా ఆమెను తమ సినిమాల్లో హీరోయిన్‌గా తీసుకుంటున్నారు. గ్లామర్ షోలకు దూరంగా ఉంటూనే ఇంతటి క్రేజ్, మార్కెట్ సంపాదించడం సాయి పల్లవికి మాత్రమే సాధ్యమైందని చెప్పొచ్చు.

తుపాను బాధితులకు సంఘీభావం.. 'కల్ట్' ప్రీ-రిలీజ్ ఈవెంట్ రద్దు

టాలీవుడ్ యువ నటుడు విష్వక్ సేన్ తన రాబోయే చిత్రం 'కల్ట్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌ను 'అర్నాబ్' తుపాను అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో, బాధితులకు సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈరోజు ఈ వేడుకను రద్దు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "ఆంధ్రప్రదేశ్‌లో అర్నాబ్ తుపాను ఎలాంటి విధ్వంసం సృష్టిస్తోందో అందరికీ తెలుసు. ఇలాంటి కష్టకాలంలో మనం బాధితులకు అండగా నిలవాలి. ఇప్పుడు వేడుకలు నిర్వహించడం సరికాదని భావించి ఈవెంట్‌ను రద్దు చేస్తున్నాం. మనమంతా ఏపీకి అండగా నిలవాలి" అని విష్వక్ సేన్ పేర్కొన్నారు.అయితే, ప్రీ-రిలీజ్ ఈవెంట్ మాత్రమే రద్దు చేశామని, సినిమా ప్రచార కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ రోజు ఒక ప్రెస్ మీట్ నిర్వహించి, 'కల్ట్' రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇక ఈ చిత్రం ముందుగా ప్రకటించినట్లుగానే అక్టోబర్ 30న థియేటర్లలో విడుదల కానుంది. ఈ విడుదల తేదీలో ఎలాంటి మార్పు లేదని చిత్రబృందం స్పష్టం చేసింది.